శ్రీ

సీతామనోహరము.

కాశినాథుని వీరమల్లయారాధ్యునిచే

వ్రాయఁబడి

కర్రా వేంకటరత్నముచేఁ

బ్రకటింపఁబడియె.

రెండవ కూర్పు 1000 ప్రతులు.

రామమోహన ముద్రాక్షరశాల, ఏలూరు.

1916

All rights Reserved] [వెల రు 0—8—0

161
2/11/[illegible]
శ్రీ కృష్ణ [illegible]
దేవరాయల ఆంధ్రభాషానిలయము
నకు బహుమతిగా ఇచ్చినది.
[illegible] 5/12/1922.

ఈ ప్రహసనంబునందలి కథ కేవలము కల్పితమగుటచేత నీగ్రంథము చదువరులకెల్లు రుచించునో తెలియరాకున్నది దీనిని రంగస్థలమందుఁ బ్రదర్శించుటకుఁగూడ నుపయోగించుకొనవచ్చును. ఈగ్రంథమునందలినీతి "ఆడుపిల్లలను యుక్తవయస్సు వచ్చుదనుక నాపి వారివారి మనోభీప్సితప్రకారము వరునివిచారించి పెండ్లి సేయవలయు" నని తేలుచున్నది. ఇయ్యది ప్రస్తుత ప్రపంచమునకు మిక్కిలి యుపయోగకారియే యని తలంచెదను. ఈ గ్రంథమును బెజవాడ కాపురస్థులగు సామా భావనారాయణ, ప్రెసిడెంటు, ఆ. ను. ను. కంపెని, గారి సహాయప్రోత్సాహములవలన నేను వ్రాసితిని. బెజవాడ గ్రామములోని ఆర్యబాల సుజనమనోరంజనీ సమాజమువారు ప్రేమతో నీకథను నాటకముగాఁ బ్రదర్శింపనున్నారు నా సాధారణమును శ్రుతిపుటమున దగిలించినట్లు లుండునేమో యనుసనె ప్రదర్శనానంతరమునఁ గాని నిర్ణయింపఁజాల. ఏదియెట్లున్నను నీతిదాయక కథాయుక్తమగుట నీగ్రంథము చదువరులచేఁ బ్రోత్సహింపఁబడు గావుత.

ఇట్లు బుధవిధేయుడు,

కాశినాధుని వీరమల్లయ్య,

గ్రంథకర్త.

ఇందువచ్చు ప్రాతలు.

:0:

* పురుషులు *

1 సూత్రధారుడు	కథనడుపువాడు
2 వణిక్పతి	కథానాయికతండ్రి
3 సోమయ్య	వణిక్పతి కుమారుడు
4 విదూషకుడు	కథానాయకుని హితుడు
5 భుజంగరావు	కథానాయకుడు
6 ప్రథమద్వితీయులు	భటులు
7 రాజు	న్యాయాధిపతి
8 డంబాచారి, ఉత్తమరావు	వకీళ్ళు
9 రంగిసెట్టి	సాక్షి

స్త్రీలు

1 నటి	కథను నడుపునది
2 కమలాంబ	కథానాయికతల్లి
3 సీతారత్నము	నాయిక
రమణి, సువదన	చెలికత్తెలు

శ్రీ

శుభమస్తు

అవిఘ్నమస్తు

సీతామనోహరము.

ప్రథమాంకము.

నాంది

చ॥ వనధిమథించుచోఁ బొడమి పర్వతరాజకుమారి కాతనూ
జుని వశమైన లచ్చిని యశోవిధిఁ జేకొనయుద్ధమాడి గె
ల్చినదనుజారి యత్తరిని లీలగ మోహిని యౌటఁగాంచి తా
వెనుకొనినట్టి శంకరుఁ డవిఘ్నముగా మిముఁ బ్రోచుఁగావుతన్ ॥

(నాంద్యంతమున నటీసూత్రధారులు ప్రవేశించుచున్నారు)

సూ—ప్రేయసీ నేడిచ్చోఁ గూడిన యీసభాసదుల మనోభీష్టసూచకంబగు నాటకంబుఁ బ్రదర్శించుటకై ప్రయత్నించుచున్న నామనంబునకుఁదగినచరిత్రంబు తోఁచకున్నయది. దీననీవును దోడ్పడవలయును

నటి—ఇంతకుమున్ను నేనొక ప్రదర్శనానుకూలంబగు గ్రంథమునుజూచితిని. అయ్యది యేతత్పరిజనమనోహ్లాదకంబని తలంచెదను.

సూ—ఏదీ ఆపాత్రమునిటు తెమ్ము (తీసికొనిచూచి) దీనినిదివఱకు నేను నుజదివియుంటిని నిక్కముగానిది ప్రస్తుతప్రదర్శనానుకూలమయినదియే.

నటి— ఆర్య దీనినెవరు రచించిరో చూడనిండు.

సూ — కవిత్వశైలినిఁబట్టి తెలిసికోఁ జాలవైతివా? తెల్పెదవినుము..

శా॥ అయ్యా! తావులకర్తమైతనరు పద్యశ్రేణిసంధించి నే
ర్పయ్యారే యనఁగా శినాథకుల దుగ్ధాంభోధిచంద్రుండు లిం
గయ్యారాధ్యసుతుండు సజ్జనగణశ్లాఘ్యుండు నా పేరమ
ల్లయ్యాఖ్యుండు రచించెఁ బ్రేక్షకులకుల్లాసంబుఁ గల్పింపఁగన్॥

నటి — ఇది నాటకలక్షణానుసారముగనున్నదా?

సూ — ఇప్పటి నాటకాదుల కాపట్టింపులు లేవు. ఇఁక నాలస్యముచేయక ఋతువర్ణనము గావింపుము ప్రదర్శన మారంభింతము.

నటి — ఏఋతువునాశ్రయించి పాడవలయును?

సూ — సర్వజనామోదకరంబగు నీవసంతమునుగూర్చియే. ఇటువినుము.

చ॥ తనమదికింపు కాని పతిఁ దండ్రి బంధించఁగ నెంచు చోమనం
బునదిగులొంది పుష్పవనముం దరిచేరెడు కన్యకాతతిం
గనుఁగొని పిల్చుటో యనెడు కైవడిఁ గోవెల లార్చుచుండఁ గో
యని బదులాడు మానినుల భాషయ మొక్క వసంతకాలమే॥

నటి — నిజము తామనులకయిష్టుఁడగు పతినివిధించు జనకులెంత మూఢచిత్తులు!

(తెఱఁగో) ఎవరో యాక్షేపించుచున్నవారు?

సూ — చెలీ! తనవెత్తిపాడుపుగా మాటలాడితిమని చీదరించుకొనుచు వణిక్పతి వచ్చుచున్నాఁడు. మనముపోవుదమురమ్ము.

(నిష్క్రమించుచున్నారు)

ఇది ప్రస్తావన.

శుభమస్తు.

అవిఘ్నమస్తు.

సీతామనోహరము.

ప్రథమాంకము.

(వణిక్పతియును నొకవృద్ధుఁడు ప్రవేశించుచున్నాఁడు)

వణి — ఆ! ఎవరు నన్నాక్షేపించునది. అవును ఆక్షేపించకేమి జగమును మాయుటకు మూకుడుందునా? లేక లేక యీవృద్ధాప్యమునఁ గలిగిన నాసంతానములో నొకరికేనియుఁ గార్యకరములఁ జేయనైతి. అందులో నాప్రథమకుమార్తెకు,

ఉ॥ పెండిలియీడువచ్చినను పెండిలిసేయకయుంటి, రేపటె
ల్లుండివయోభరంబయిన లోకము నింద్యము సేతురింటిలోఁ
గొండొకకారణంబునను కూతురుదల్లియు నిష్ప్రసిద్ధమై
యుండిన యట్టిమేనరిక మొల్లరు కార్యమదెట్లుసాగునో॥

నాతోఁబుట్టువు తనకుమారునకు నాబిడ్డనిచ్చి వివాహముసేయుమనియు లేకున్నమనసంబంధమింతటితో నంతరించిపోవుననియుఁ బలుమారులు నాతోఁ జెప్పుకొని కంటఁదడిపెట్టుకొనుటను జూచి వారిపేదరికమును గుఱ్ఱవాని విరూపమాంద్యగుణములును విచారింపకయే నేనంగీకరింతునని మాయాఁడువారు నన్ను మందలింపఁ బ్రయత్నించుచుండిరి.

తే॥ గీ॥ తెలివిగలయట్టివాఁడైన తెల్విహీనుఁ
డయిన మేనల్లునకొసంగు న్యాయమొకటి
మొదటినుండియు కులమందు ముఖ్యమయ్యె
దానినేడెట్లుతప్పింతు ధనముకొఱకు॥

పోనిమ్ము. ఎటులయిన స్వతంత్రించి చేయుదమన్నను,

తే॥ గీ॥ ఆఁడువారలమాటల నవలఁ బెట్టి
పనులు నెరవేర్చు శక్తి మావర్ణమునకు
సాగ నేరదు కాని యీసమయమందు
నాకు తప్పక వచ్చె కన్యకను గూర్చి॥

ఏమి సేయుటకును దరియుతెన్నును తోఁచకున్నయది. ఇచ్చిన నింటిలోని పోరు ఘనమగును. ఈకున్న మత్సహోదరి కంటనీరు బెట్టుకొనును ఉపరి పరమార్థహానియు సంభవించును

ఉ॥ ఐనను బిల్చి నా సుదతికంతయు జెప్పి మనంబు ద్రిప్పి సం
ధానము సేయ గావలయు దైవము గూడ ననుగ్రహించి నా
చానను దానొడంబడిచి సర్వవిధంబుల మేనయల్లుఁడే
దీనిని బెండ్లియాడుటకు దివ్యముహూర్తముగూర్పమేలగున్.

(తిరిగి చూచి) అదిగో! అనుకొనునప్పటికే నా భార్యకూడ నిటు వచ్చుచున్నది. కొంచెము నెమ్మదిగా జెప్పినచో వినకమానునా? మేనల్లునకు పిల్లనిచ్చువారికి పుణ్యలోకగతులు గలుగునందురు భూమియందుఁ బుట్టినపిమ్మట పుణ్యలోకగతులకుఁ బ్రయత్నింపనివారుందురా? కావునఁ దప్పక యొప్పుకొనునని తోఁచెడిని. —

(వణిక్పతి భార్యయగు కమలాంబ ప్రవేశించుచున్నది)

కమ — (ప్రవేశించి తనలో) నా మోహనాంగుని ముఖారవిందము దీర్ఘాలోచనభావమును బొడసూపుచున్నది. దేనినిఁ గూర్చియైయుండునో. ఏముండఁగలదు. కుమార్తె వివాహమును గూర్చియే చింతించుచుండబోలు అయినను గనుఁగొందము (సమీపించి ప్రకాశముగా) నాథా! మీ రేదియో గాఢాలోచన సేయుచున్నట్లు ముఖభావము తెల్పుచున్నది. నేను వినఁదగియుంటినేని నొలవిందు.

వణి — (తనలో) అడిగినప్పుడే చెప్పినచో సంగీకరించునేమో! (ప్రకాశముగా) ఏమియును లేదు నీకుఁ దెలియని దేమున్నది.

కమ — విస్పష్టముగాఁ జెప్పనిదే తెలిసికొనఁజాలునంత తెలివి నాకు లేదని మీరుమాత్రమెఱుఁగరా?

వణి — నీచమత్కారవచనములకేమి లే. అయినను జెప్పెదను వినుము.

మ॥ చెలియా! పుత్రికిఁ బెండ్లియీడగుట నీచేతం బెఱుంగుంగదా
యలివేణి! మనమేనయల్లునకు నీయం సౌఖ్యముం జెందు స
ల్లలితుండాతఁడు వానికిచ్చినను నుల్లంబారఁగా సౌఖ్యముల్
తలిదండ్రుల్గని పుణ్యలోకమున నిత్యశ్రేయముల్గాంచెదం.

కమ — (తనలో) ఈయనగారికి మొదటినుండియు నీవివాహవిషయాలోచనయే. శరీరదార్బల్యము కూడ సంభవింపజేసినది పోనిమ్ము. మేనల్లునకిచ్చుట కంగీకరింతమన్న వారిస్థితిగతులు కన్నులారఁజూచుచు నిష్కారణము పిల్లగొంతుకోయుటకు నామనమియ్యకొనకుండె ఈసంగతి చెప్పిన నిప్పటియీయన మనోవ్యథ మతియింత వృద్ధికాఁగలదు ఏమేనియగుఁగాక (ప్రకాశముగా) మనోనాయకా! మీరు చెప్పినమాట వాస్తవమే ఏదేనిఁదగు సంబంధముచూచుకొని శీఘ్రముగా వివాహము సేయుట యత్యావశ్యకము. జాగుచేసిన సాటివారిలోఁ దలవంపులు ఘటిల్లును.

వణి — (తనలో) మేనరికమిచ్చుట కిష్టములేదనుమాటమిక్కిలి గంభీరముగా వెలిఁబుచ్చినదే! వాగ్గుంభనకు స్త్రీజనములే ప్రథమగణ్యలు (ప్రకాశముగా) తగినసంబంధము కుదిరియేయున్నదికదా!

కమ — ఏదీ?

వణి — మేనరికము.

కమ — మేనరికమా? తగినసంబంధమే ఇదియొకటియేనా? యింకేదైన నాలోచించియుంటిరా?

వణి — నాయభిప్రాయము గట్టిగా వానికీవలయుననియే.

తే॥ గీ॥ నీయభిప్రాయమును జెప్ప నీరజాక్షి
జాగుసేయుటమనకుఁ గర్జంబు కాదు

అనతికాలంబుననె వివాహంబు సేయ
వలయు నీడువచ్చినపిల్ల నిలుపఁదగదు॥

కమ— వారిదరిద్రదేవత మనయమ్మాయినెత్తినఁగూడఁ దాండవమాడుచుఁ గూటికిగుడ్డకు మొగమువాయు నట్లొనరింపవలయునని యా మీయభిప్రాయము. బాగుగనేయున్నది.

వణి— ఆ! నీమాటలకేమిలే,

తే॥ గీ॥ ద్రవ్యమున కేమి మనకున్న దానిలోనె
వారుకూడ ననుదినుచుందురు వలయు నేనిఁ.
దోడబుట్టిన దానిని దుఃఖపెట్టి
పరులకిచ్చిన ఫలమేమి పంకజాక్షి.

కమ— తోడబుట్టినదాని దుఃఖము తీర్చుటకుఁ గడుపునఁ బుట్టినదానిని వంతఁగుడిపెదరా యేమి? ముందాలోచనలేక మీతండిగారు మీతోఁబుట్టువును బేదలకిచ్చుటచేత నేకదా యీపె విచారమును మీరు తీర్చుటకుఁ బ్రయత్నించుట సంభవించినది. మీరునట్టిపని యోకావించి ముక్కుపచ్చలారని మన చిన్నికుమారునకు నిట్టికష్టములే కల్పించెదరు కాఁబోలు ఇది నాకిష్టము లేదు మఱియొక సంబంధము చూడుఁడు.

వణి— బాగుగాఁజెప్పితివి దానిభారము మనమేమి మోయుచున్నాము? దానికొమరుఁడు మాత్రము మన పిల్లలయట్టివాఁడు కాఁడా? వాని కార్యకరముల విషయమై మనమాలోచించుట తప్పిదమా?

కమ— తప్పితమే అన్నవస్త్రములకు లేక యల్లాడువాని మెడకొక గుదియబండ కట్టినట్లు భార్యాపోష్యమునుగూడ నొప్పగించుట యుచితమా.

వణి— నీయుక్తి నాకంత సమంజసముగాఁ గన్పట్టుట లేదు భార్యను బోషించుకొనఁజాలని యంతయసమర్థులుందురా? ఏమైనను సరే యీ చిన్నదానిని వానికేయిచ్చి పెండ్లిచేసెదను.

కమ— అట్లుసేయుటవలని నష్టము నాకొకటియుఁ మీకొకటియు గాఁ

డు. ఉభయులకును సమానమే ఈ సంబంధమును జేసికొనుట యందు మనపిల్లదానికిఁగూడ బొత్తుగా నిష్టములేదు. అననుకూల దాంపత్యమువలన సౌఖ్యమును సత్ప్రతిష్ఠయుఁగూడ సంప్రాప్తము కాగలదు. ఈడువచ్చినపిల్లకయిష్టుఁడగు వరునినంటగట్టుటయుచితంబుకాదు. పిల్లదానినిఁ బిలిచిమీరును గనుఁగొనుఁడు. ఈచుట్టరికము కూడదని మనసోముఁడుకూడ పలుమారులు ముచ్చటించి యున్నాఁడు.

వణి — నీమాటలునాకుఁ గడునాశ్చర్యమును బుట్టించుచున్నవి.

తే॥ గీ॥ లోకమందుననెవరేని నీకునిష్ట
మా యటంచును బిల్లలనడిగి పెండ్లి
సేయువిధమునఁగంటిమే చిఱుతగఱిత
లరయనేర్తురె నిజమనోహరులనెపుడు॥

కమ — ఇంటిలోఁ దల్లిపిల్లల కెవరికిని నిష్టములేనపుడు పరమస్వతంత్రులముగదాయని మీయిచ్ఛవచ్చినట్లు గొంతును గోయనెంచుట మీకుమాత్రము మహాగౌరవము గాఁబోలును! కడుపునఁ బుట్టిన పిల్లల సేమమారయనివారు లోకములో మీరుతప్ప యింకెవరును గానఁబడరు.

వణి — (తనలో) ఈమెకు నిజముగా కోపమువచ్చినట్లున్నది. పాపము! యీపెచెప్పెడిమాటలన్నియు సహేతుకములుగా నున్నను పరమార్థహాని సంభవించునేమోయను భయముచేతను జెలియలిపై ప్రేమచేతను నామనసున జొరకున్నయవి కావున సామవచనంబులచేతనే ఈచానవొప్పించి కార్యముసానుకూలపరచెద (ప్రకాశముగా) ఓకాంతామణీ! నీవును దెలియని మూఢురాలివలెఁ గోపించెదవేల? ఇటువినుము,

చ॥ ఘనతరపాపహేతుకము గాదిలియల్లునకీయకుండ నే
ధనికునకో యొసంగుటది తద్దయునక్రమకార్యమందునుఁ
వనరుహపత్రనేత్ర పెఱవారలకిచ్చిన నేమిలాభ మ
ల్లునకునొసంగుటేజగతిలో ఘనకార్యము మానినీమణీ॥

కావున,

తే॥ గీ॥ కుఱ్ఱవానినిఁగూడను గొంతియడిగి
కార్యనిశ్చయమును సేయఁ గడఁగవలయు
నెన్ని కార్యమ్ములున్నను సన్నుతాంగి
వానిబిలిపింపుమిపుడు సత్వరము గాను॥

కమ— ఈగొడవనాకేల? నేనబోయి పిల్లవానినిఁబంపెదను మీరిరువురు నాలోచించి కార్యనిశ్చయము జేసికొనుఁడు.

వణి— మంచిది నీవట్లు సేయుము

కమ— (నిష్క్రమించుచున్నది)

వణి— ఈబాంధవ్యమునుగూర్చి వీరికింత పట్టుదలతగునా? పేదలఁకదా వీరుసెప్పెడి యభ్యంతరము కలిమిలేములు కాపురము సేయునా? బండులోడలునుగావచ్చు నోడలుబండ్లునుగావచ్చును ఇదికాక కురూపియందురేమో, యాసంశయమును దీర్చుటకు వాఁడౌషధము సేవించుచునేయున్నాఁడు కదా! అయినను గుఱ్ఱవాఁడేమి సెప్పునో కనుఁగొందము (తిరిగిచూచి) అడుగోవచ్చుచున్నాఁడు.

(సోముఁడు ప్రవేశించుచున్నాఁడు)

సోము— (ప్రవేశించి) తండ్రీనమస్కారము నన్నేటికిఁబిలిపించితిరి?

వణి— నాయనా రమ్ము కూరుచుండుము నీతోనొక్కవిషయంబున నాలోచించుటకునై పిలిచితివి సావధానముగా వినుము.

సోము— (తనలో) మాతల్లిగారు నాతోనంతయుఁ జెప్పియేపంపినదికదా ఆవిషయముకే మరలముచ్చటించును యీసందర్భములో నమ్మగారి యభిప్రాయమే సమంజసముగానున్నది. అయినను దండ్రిగారేమి చెప్పుదురోగనుగొందము (ప్రకాశముగా) జనకా సెలవిండు.

వణి— (తనలో) వీనికింతయుఁ దల్లినూరిపోసియే యుండును అయినను జెప్పిచూతము (ప్రకాశముగా)

మ॥ తనయా నీ సహోదరీమణిని సీతారత్నముఁ బావరా
మునకున్వేడ్కనొసంగి పెండ్లిసలుపన్ మోదంబుగన్నెన్నదిన్

మనమారీతిని సంప్రతించుటకు మీమామ తన్నినుఁ బిల్చితిఁ
జనుమాగణంబును నిశ్చయింపుము కులాచారంబు పోకుండఁగ॥

సోము— (తనలో) విన్నదానికంటె నధికమగు సంగతు లేవియును లేవు ఈయనకు మేనల్లునకే యీవలెనన్న పట్టుదలయేల కలిగినదో తోఁచకున్నది ఇట్లనిచూచెదను (ప్రకాశముగా)

తే॥ గీ॥ తండ్రినియమించు విధినన్యథాకరింపఁ
దప్పటంచును దెలిసియుఁ జెప్పుచుంటి
నీడువచ్చినపిల్లల యిష్టవిధిని
జరుపఁబూనుట కజ్జంబు జనకమనకు॥

వణి— (తనలో) అహా అనుకొనినంతయు జరిగినది తనయిష్టమునంత యు వీనిఁగూడ నూరిపోసియేపంపినది యించుకకోపగించి చూచెదను. ప్రకాశముగా)

తే॥ గీ॥ ఓరిమూర్ఖుఁడమితిమీరి నోరికెట్లు
వచ్చినట్లాడుచుంటివా భయమువిడిచి
సంప్రతింపుగ నడిగినఁజలముమిగిలి
యుడ్డదిడ్డంబులాడెదవా ఖలుండ॥

సోము— (తనలో) అయ్యోనాజనకుఁడు నన్నునిష్కారణముగఁగోపగింప బూనినాఁడే యీయనగారిపద్ధతి నాకుఁ దెలిసినప్పటి నుండియు నింతే తాఁబట్టినకుందేటికి మూడేకాళ్ళనుటయే కాని యాలోచన యెంతమాత్రమును లేదు. (ప్రకాశముగా)

తే॥ గీ॥ కోపగింపకుమయ్యనేఁ కుఱ్ఱదాని
నడిగివచియింతునింకొక్క యామమునకు
జనకయాలోనవేఱొక్క పనినిఁజూచు
కొనుడుతొందరపడఁగార్యమునకుమేలె॥

వణి— (కోపముతో) కుఱ్ఱవానినడిగిన విమ్మటఁ జెప్పెదవా నీయిష్టము ను నీవారి యిష్టమును లేనిచో ననీకార్యమును సేయఁజాలనేమి? వీలిఁ యడిగితినికదాయని విఱ్ఱవీగుచున్నారు కాఁబోలును కానిం

డు. మీరలెట్లడ్డగలరో చూచెదనుగాక.

సోము-(తనలో) అయ్యో! యీయనకీ దురాగ్రహమేలో? కో ముందువెనుకల నించుకయు నాలోచింపకున్నాడే యిట్లగుగాక (ప్రకాశముగా) తండ్రీ మీ ప్రయత్నమును గాదనఁజాలువారెవరు? పెండ్లియైనపిమ్మట యావజ్జీవమును మగనిదాస్యములో నుండవలసినదికనుక నా సహోదరి యభిమతమును గూడఁ దెలిసికొని వచియింతునంటిని యిందేమి తప్పిదమున్నది.

వణి—తప్పిదమేమియును లేదు లెమ్ము.

క॥ ఏమైనను మేనల్లున
కీమగువనునీయ నిశ్చయించితి మీరున్
భామామణి యొప్పునటుల్
సామంబునఁ జెప్పిరందు చయ్యన నిటకున్॥

సోము-మీరు నిశ్చయించిన పిమ్మట నేనడిగి చెప్పవలసిన దేముండును. చెప్పినదానిని సరియయిన యాలోచనలోఁ బెట్టనప్పుడు నేనేమి సేయగలను. అననుకూల దాంపత్యము కులమును జెడఁగొట్టుననుట మీరెఱుంగనిదికాదు. తక్కినకులములమాట యెట్లున్నను మనకులపువనితలలో నేకారణముచేతనేమి చెడునడవడికలవారరుదు అట్టియెడ,

క॥ అరసియు నరయక యీగతి
జిఱుతఁపుఁ బంతమునఁ బూని సెట్టికొలమ్మున్
జెఱుపఁదలంచుట తగవే
గఱితలసాహసముచేతఁ గల్పింపదొకో॥

వణి—నీమాత్రము నాకాలోచన లేకపోలేదు తెలిసియుఁ దెలియని నీప్రసంగమును విస్తరింపకుము నేను గ్రామాంతరమునకుఁ బోయి వచ్చునప్పటికి యంతయును సిద్ధముచేసి యుంచుము. రేపటియష్టమీ బుధవారమునాడు మంచిసుముహూర్తము కలదని మనపురోహితుఁడు నాతోఁ జెప్పియున్నాఁడు విచారించి వచ్చెదను.

(నిష్క్రమించుచున్నాఁడు)

సోము — అకటా పూర్వకాలపు హిందూమతోద్ధారకులు బాల్యవివాహములును వధూవరుల యిర్వురి యిష్టమును విచారించక తలిదండ్రుల యిష్టానుసారము గావించు వివాహములును జేయవచ్చునని నియమించుట ప్రస్తుతకాలమునకు మిక్కిల విపరీతమయి పరిణమించినది. అట్లుజరుపుచుండుట చేతనేకదా,

చ॥ సరసిజనేత్రులందు వ్యభిచారము హెచ్చె తటస్థమైనచో
పరులనుగాసివెట్టె బలవన్మరణంబులఁగాంచగల్గు ని
ర్వరకు నయిష్టమైనపుడు భూమినివింతలు పుట్టుటన్న న
చ్చెరువగునే గ్రహింపకిటు శీలముబాపుట యుక్తమానొకో॥

అయినను జిన్నవాఁడనగు నేనేమిసేయఁగలను నిష్కారణముగా నాతండ్రిగారు నన్నాదరముచేసి యుండిరి. ఇప్పటికయినను పెద్దలందరు నొక్కమాట నయుకొని ప్రస్తుతప్రపంచస్థితికిఁ దగినట్లు వివాహములు గావించినచో నెంత బాగుగానుండును (తిరిగిచూచి) అదిగో మాయమ్మయు నాసహోదరియు నిటువచ్చుచున్నారు. ఏమాలోచించుకొనిరో తెలిసికొని యెదను.

(కమలాంబయు నాపెకూతురు సీతారత్నమును ప్రవేశించుచున్నారు.)

సోము — అమ్మా నాన్నగారు కొండొకకార్యమునకయి యవలకుఁబోయినారు తానుతిరిగివచ్చునప్పటికి మనముమ్వురము నాలోచించి ఆయన యిష్టానుసారము గాజరుపుటకు సిద్ధముగానుండవలయునట అమ్మాయితో నిదియంతయుఁ జెప్పితివా?

కమ — ఆ! నేను చెప్పడమయినది. నీవుకూడ చెప్పి లేదనిపించుకొనుము.

సోము — (తనలో) జనకునాజ్ఞ నిర్వహించక తప్పదుగదా నావిధిప్రకారము నేను చెప్పిచూచెదను. (ప్రకాశముగా)

కమాచిరాగము – ఆటతాళము.

(బాలరావేమట్టు)

చాననిన్ను మేనబావకు సలలితంబుగ పెండ్లిసేయఁగ।
జనకుమనమున నిశ్చయించెను సమ్మతింతువె చెలియలా॥ చాన

సీత — అన్న నన్ను ఖిన్నఁ జేయఁగఁ గన్నతండ్రికిఁ గలిగెఁగా।
ఇన్నియేటికి నన్నతని కీయన్న మడిసెద విన్నవింపుము॥ అన్న

సోము — ఎవరు సెప్పిన చెవినిఁ బెట్టఁడు యువతి నీదగు కర్మవశమున
నవసరంబుగ నెవియుఁ జూడక కువలయాక్షి రోకోప మొందుము

సీత — ముందు వెనుకలఁ జూడ నెంచక ముందుఁ డైన వానికి నొసంగిన।
నెందునో యే వేళనో నా యిందుశేఖర లోకమే గద॥ అన్న

సోము — జనకు నానతి మీరఁబోకుము వనిత దుర్గతిఁ గల్గెదుఁ।
జనన మొందఁగఁ జేయు వేళను వనజనేత్రుఁడు వ్రాయు రీతిని॥ చాన

సీత — విధివశంబునఁ బృథివిలోఁ బడి యధమ విధమును గూర్చి చింతిల।
వృథయ కాకెటు మనలకు మనోరథము తీరును సోదరా॥ అన్న

సోము — (తనలో) అకటా! ఈమె మనోనిశ్చయము కడు లెస్సగానున్నదే! నాతండ్రిగారికిని నా చెలియలికినిఁ గల పరస్పర భేదాభిప్రాయములను బట్టి చూడ దురంతమగు నొక యల్లరి పుట్టునని తోఁచుచున్నది. నా శక్తి కొలఁది ప్రయత్నించి యీమె యొక్క యభిప్రాయమును మార్ప జూచెదను (ప్రకాశముగా) అమ్మాయి (బ్రతిమాలుటనభినయించుచు)

తే॥గీ॥ ఆడువారికి స్వాతంత్ర్యమన్న మాట
సున్న యనినీ వెరుంగవే చిన్ని చెల్లి
తండ్రిమాటను మీరుట తగవు కాదు
చదువుకొన్నట్టి నీబోటి సుదతి కెపుడు॥

సీతా — అన్నా! నీవుకూడ నిష్కారణముగా నన్ను కోపగింప నెంచితివా?

చ॥ వనితకుఁ బుట్టువాది పదివత్సరముల్వయి మీరుదాఁక త
జ్జననికిఁ దండ్రికిన్వడఁకు చందము పై మృతినొందుదాఁక భ
ర్తను మఱి పుత్రులన్ గనినఁ దద్దయు భీతిలుచుండు చందముల్
వనజభవుండు వ్రాయుటది పాక్షికవృత్తియు కాకన్యాయమే॥

కన్నతలిదండ్రులుగాని చేసికొనినభర్తగాని కడుపునపుట్టినబిడ్డలుగాని యాఁడుదానికేడుగడగానుండి వారికనుకూలమగు విషయములనన్నిటిని చారించి నెఱవేర్తురని యేకదా స్త్రీలకస్వాతంత్ర్యమును నియ

మించినది. తద్భిన్నాచరణులైన జననీజనక భర్తృపుత్రాదులకు కాంతాజనములు మాత్రమేలలోఁబడవలయును?

సోము — అమ్మాయి! తండ్రిగారుమాత్రము నీకేమి యుపకారము చేయఁబూనినారు? నిష్కారణముగ నేలతర్కించెదవు.

సీతా — అన్నా? ఇంకేమి చేయవలయును. ఇట్టి ప్రయత్నములు చేతనే కదా లోకలోములోని స్త్రీసంఘములో ననేకులకు దుర్వారమగు దుర్గతులు సంభవించుచున్నవి.

సోము — ఎందువలన?

సీతా — ఎందువల్లననియా? ఇటువినుము.

తే॥ గీ॥ మనువకిష్టంబు లేనట్టి మగనిఁ దెచ్చి
పెండ్లి సేయుట చేతనే బిసరుహాక్షు
లందుఁ బెక్కురుగుణహీనలగుచు వ్యభిచ
రించి శీలంబు పాడొనరించుచుంద్రు॥

శా॥ ఈడుర్ జోడయి యొండొరుల్ వలచి స్నేహేచ్ఛన్ వివాహంబునైరూడన్ గుడ్డకు లోపముండక మహాసౌఖ్యంబుగా దంపతుల్
క్రీడల్ సల్పుచు గాఢమౌవలపునన్ రేలుంబవల్పుచ్చుచో
బాడుంబుద్ధులు పుట్టునేపడతు లవ్యక్తంబుగానుండురే॥

ఆఁడుపిల్లలబాధ్యత వహించినప్పుడు జననీజనకు లివియన్నియు స్వయముగా నాలోచించుటే విధ్యుక్తము కానిచో వారినిర్ణయములు పుత్రికలచే నెట్లంగీకరింపఁబడును.

కమ — నాముద్దుపట్టీ! నీమురిపెములు జెల్లించుటకే గదా నీతండ్రిగారి ప్రయత్నమునకు బూనియున్నది. నీమంచిచెడుగుల నాయనమాత్రము విచారింపకుందురా.

సీతా — (తనలో) తండ్రిగారొనర్పఁబూనినది తనకయిష్టమైనచో భర్తృతిరస్కారమునకు వెరచి పైకొరకిట్లనుచున్నది. (ప్రకాశముగా.)

శా॥ అమ్మా మీసుతవిన్నపంబొకటి న్యాయంబైన సద్బుద్ధిఁజే
కొమ్మా సుందరవిగ్రహుండగుచు నాకుం జోడునౌవానికీ

విమ్మా మేనరికంబటంచునను నట్టేటం బడఁద్రోయమో
దమ్మా నాకు సుఖోదయమ్మౌనకుఁ గాదా పెండ్లిగావించుటల్॥

తే॥ గీ॥ అమ్మ నవమాసములు మోసి నట్టినీవు
దయను విడనాడినావె నాతండ్రివలెనె
మీకు నిర్భారకుఁడుగాని నాకు భూమి
పైన మనియున్న నొక్కింత ఫలముగలదె॥

క॥ ఆజన్మాంతము పతి కే
యోజఁ దగు సేవసేతు నొల్లమికతనన్
నాజన్మంబిటు దుఃఖపుఁ
భాజనముగ సేయమీకుఁ బాపము గాదె॥

(బేహాగ్ రాగము-ఏకతాళము.)
(భూపతిమాపరితాపముదీరిచి మట్టు)

సోమ—సోదరినీదగు వాదములను విడి। సాదరమున సమ్మోదముగను మా
కాదనని కేదయినా। రాదగు లాభము కనఁబడఁజాలదు॥ సో॥—

సీతా—ఏటికిబూటకి మీగతి చేసెదు। తేట తెల్లముగఁ దెలిసియు మో
మోటమునన్। మాటవినన్। జేటగు సోదర చెప్పకు మీ యెడ॥ నే॥

సో-ఈయెడ నాయన చేయుట మానడు। చేయుచు పాయక చెల్లదు సుమ్మీ
దాయలలో హేయము గాదా! యో చెల్లెల తప్పక వినుమా॥

సీ-అనయము వనితలకనపాయమ్మగు। పనిబూనుట యోఘనముగుఁ గాకెటు
తనదగు వర్తనమును మా। నని చోఁ గాఁదగు పని చూచెద పై॥

వణి—(ప్రవేశించి తనలో) ఓహో మా సీతారత్నము మాటలు బహు కఠినముగానున్నవే. ఆపెకీసంబంధము బొత్తుగా నిష్టము లేదనుటయే నిక్కముగాఁ గనఁబడుచున్నది. అయినను స్వయముగా నేను బోయి నాలుగు వేలరూకలు నగల క్రింద నిచ్చునటు తీర్పుఅచి మాట యిచ్చివచ్చితినిగదా! తప్పు టెట్లు? వీరిసంభాషణ విననట్టే నటించి కర్తవ్యమును దెల్పెద. (ప్రకాశముగా) కుమారా! సంబంధ

ము నిశ్చయించుకొనవచ్చితిని. కట్టుబాటులన్నియు మన కనుకూలముగానే కుదిరినవి.

చ॥ అనువుగ జేసివచ్చితి సహస్రచతుష్టయ రూప్యముల్ నగల్
మనకొకచీరలైదు మరిమంగళహారతి పళ్ళెరంబునం
దున శతరూప్యముల్ పయిచతుర్దశగున్న నడవళ్ళక్రిందమా
కొనిమిడివందలేర్పఱచి యీ బహుళాష్టమి లగ్నముంచితిన్॥

తే॥ గీ॥ మనప్రయత్నంబులన్నియు మనము చేసి
కొనుట యావశ్యకంబయ్యె కొమరిఁ బెండ్లి
కూతుఁ జేయింపు మెల్లుండి గుమతగముగ
సలరి తరలివచ్చెదరు వియ్యాలవారు॥

కావున నీవు తత్క్షణంబ ముద్రాలయమునకేగి శుభపత్రికల నచ్చొత్తించి బంధువులందఱికిఁ బంపి యాహ్వానపఱపుము.

పో—తండ్రీ చిత్తము సెలవుగైకొనెదను. (నిష్క్రమించుచున్నాఁడు.)

వణి—కాంతామణీ! నీవు కడుజాగరూకురాలవై పనిబాగులవారిచే ప్రయత్నమంతయు సిద్ధము సేయింపుము. కార్యనిర్వాహకమంతయు నీవలననే కాఁదగినది ప్రతిష్ఠాప్రతిష్ఠలు మననెత్తిపైబడును. నీవిక తడయకపొమ్ము.

కమ—నాథా! మీయభీష్టమున కన్యథాకరించువారెవరు. (నిష్క్రమించును.)

సీతా—(తనలో) నాయభిప్రాయము జనకుని చెవినిగూడ బడవైచి యుంచుట యుక్తమని తోచెడిని (ప్రకాశముగా.)

తోడిరాగము ఏకతాళము

(మేర కాదు నా మనవిని వినుము మట్టు.)

మేనరికమీ కొనకుము జనకా
మనోంబుజమ్మున బూనకకినుక॥ మేన॥
నా మనంబునందునలవరి పూరుషునకు
నన్నొసంగుటన్న మీకు గన్నతండ్రిలక్షణంబ॥ మేన॥

వణి—(తనలో) ఓహో! ఈమె తనయభిమతంబును నాకుకూడ దెలుప సాహసించినదే. ఇందున కెడమీయకూడదు. (ప్రకాశముగా) ఛీ నిర్భాగ్యురాలా సిగ్గునువిడనాడి నాతోఁగూడ నడ్డదిడ్డముల జెప్పుచుంటివా చాలునికి నోరుమూయుము. (నిష్క్రమించుచున్నాఁడు.)

సీతా— అకటా! కన్నతండ్రిఁగదా యని నాయభిమతమును జెప్పికొనబోవసహజమునకుమించిన కాఠిన్యము నువహించి నాజనకుండు చీదరించుకొనుచు నావలకుఁబోయె ఇకనా మొరాలకించువారెవరు భూమియందున సృష్టించునవుడా స్రష్ట నానొసట నెట్టు వ్రాసెనో యట్లు జరుగును నేను చింతించినఫలమేమి నాయిష్టదైవంబగు శంకరునిగూర్చి ఇంచుక ప్రార్థించుకొనెదను.

(తోడిరాగము ఏకతాళము.)

(శంకరాభరణరామట్లు.)

ఈశ్వరా కావరా।
నామనోరథంబుదీర్ప రారా వేగ ॥నీశ్వ॥
అనయంబునిన్నే మనమందునెంచెద।
ఘనముగబ్రోవర కామాంతకా వేగ ॥నీశ్వ॥
నన్నొక్క మూర్ఖుని మెడఁగట్టజూచెదు।
జనకు నెమ్మనంబు మరలింపరా వేగ ॥నీశ్వ॥

ఇతి శ్రీమత్కాశీనాథుని వీరమల్లయారాధ్య
విరచిత సీతామనోహరనాట
కంబున ప్రథమాంకము.

శుభమస్తు.

అవిఘ్నమస్తు.

సీతామనోహరము.

ద్వితీయాంకము.

(విష్కంభము.)

(రమణి, సువదనలను నిద్దరు చెలికత్తెలు ప్రవేశించుచున్నారు)

రమ — సఖీ; మనసీతారత్నము పెండ్లిచేసికొనననీ బిఱ్ఱబిగిసి చివఱకు మేనబావగారినే కట్టుకొన్నదే మొదటనే బెట్టుసేయకయున్నచో గౌరవముగా నుండెడిదిసుమా!

సువ — ఆమె కిప్పుడు నూత్నముగ గౌరవహాని యేమి సంభవించినది? ఆమె పట్టుదలకేమియు భంగము కలుగనే లేదు.

రమ — భంగము కలుగలేదా: బాగాయె నీపలుకులు మిక్కిలి వింతగానున్నవే పెండ్లికిని మొన్న గర్భాధానమునకునుగూడ పేరంటము చేసిన నీకు మఱితప్పుచున్నదా యేమి?

సువ — పెండ్లియైనంతమాత్రముననే యాతనునాపె పెనిమిటియైనాఁడనుకొంటివా యేమి?

రమ — ఏలకాఁడు? ఎట్టివాఁడగును?

సువ — సీతారత్నమతనిని మనస్సాక్షిగా వరింపకుండుటచే నతఁడు భర్త కాఁడు కన్యాపురుషులిరువురును పరస్పరానురాగము కలవారయి యొండొరుల వరించునపుడు భార్యాభర్తలగుదురు స్వయంవరము కానిచో యితరులు బలాత్కారముగ వేడుకలుగావించుకొన్నంతమాత్రమున నది పెండ్లియగునా? అట్టిస్త్రీపురుషులు దంపతులగుదురా.

రమ — దంపతులే కానిచో సీతారత్నము గర్భాదాన వైభవమునకెట్లొడఁబడినది?

సువ — అదియును బూటకమే ఆనాఁడు కల్పితభర్తయగు సీతాపతికిఁ బరాభవముతప్ప మఱేమియుఁగాలేదు.

రమ — చెలీ ! యీచరిత్రము కడునద్భుతముగా నున్నది సుమీ ! ఎటువంటి పరాభవము జరిగినది ?

సువ — ఆనిషేకముహూర్తమునాఁడు తల్లి మొదలగు స్త్రీజనముల ప్రేరణముచేఁ గొందఱు స్త్రీలు పట్టి బలవంతముగా సీతారత్నముగదిలోనికిఁ ద్రోయఁబడిన పిమ్మటఁ గవాటమును మఱియొక కాంతారత్నము బంధించినది.

రమ — తరువాత నేమిజరిగినది ?

సువ — మన చెలికత్తె లోపలికిఁబోయి నిజమనోహర సంయోగావాప్తి కొఱకయి పూనికతోఁ బరమేశ్వరునిఁగూర్చి ధ్యానించుచు యోగముద్రధరించి యొకమూల గూర్చుండెను. అప్పుడా నిరర్థక పురుషుఁడు సీతారత్నముయొక్క యసమాన యోగినీవేషమును గాంచి మనంబున నచ్చెరువొంది సాగిలి పాదాక్రాంతుఁడై యంతటి నుండియు నామె ప్రశంసయే తలపెట్టక కొండొకగదిలోఁ దనగుట్టు బయల్పడకుండునటుల నిద్రించుచుఁ గాలము గడుపుచున్నాఁడట.

రమ — ఇదంతయు నీకెవరుచెప్పిరి ? యీయుదంతమంతయును నమ్ముటకు శక్యము గాకున్నదే !

సువ — నీయట్టి మూర్ఖురాండ్ర కటులనే కనఁబడుచుండును లెమ్ము. ఇదినాతో మన సీతారత్నమే రహస్యముగఁ జెప్పినది. మరల నెవ్వరితో ననకుసుమీ ?

రమ — లేదు నీతోడు. నిజముగాఁ జెప్పను కాని నిజమనోహరసంయోగావ్యాప్తికొఱకంటివే యానిజమనోహరుఁడెవఁడు?

సువ — అతఁడు మనభుజంగరావే.

రమ — అటులనా ? వారిరువురికి నీకును జోడును జక్కఁగా సరిపోయినది కాని వారికి సంయోగ మెట్లుసంభవింపగలదు.

సువ — దానికిఁదగు నేర్పాటు గావించి యిటు వచ్చుచున్నాను. బ

హుస్వల్పకాలముననే యాతేఁడు రాఁగలఁడు. వీరిరువురకును గూటమి సంభవింపఁగలదు. నీవే చూతువు లెమ్ము.

రమ—వీరి రహస్యసంయోగము బయల్పడినచో లోకులీ యిరువురిపై వ్యభిచారదోష మారోపింపరా?

సువ—ఆరోపింతురుగాక ప్రాపంచక మాయాచిత్తులైన లోకులేమను కొన్న నేమిలాభము పరలోకదూష్యము కాదుకదా.

రమ—లోకులమాట నటుంచుము ఈపెయొక్క జననీజనకులు మాత్రము దీనికి హర్షించి యూరకుందురా?

సువ—ఊరకొనకున్న నీపాపమంతయు వారిపాలే యగును బలాత్కారముగా నొకరి కంటఁగట్టుటకు వీరికధికారముకలదా?

రమ—అటులైన నీవిప్పుడెచ్చటికిఁ బోయెదవు?

సువ—ఈసమీపముననే యుద్యానవనమందు మనసీతారత్నమున్నది. పోయి యామెను గలిసికొందమురమ్ము. (నిష్క్రమించును.)

(ఇది విష్కంభము.)

(ఉద్యానవనమందు సీతారత్నము ప్రవేశించుచున్నది.)

బేహాగ్ రాగము అటతాళము.

(ఔరానారీ మట్టు)

అకటమదనా వికటంబుతగునా॥ అ॥
సుకుమారినగునన్ను గికురింపనగునా॥ యు॥
సరసిజనేత్రుని సాన్నిధ్యమునకు
వరకరుణను జేర్చి తరియింపరాదా॥ యు॥
అరుదగునాయనో హరసంయోగమున
దిరుగుచు సంతోష భరమొందకుండ॥ న॥
రావుకులార్ణవ ప్రభువుభుజంగ।
రావు కౌగిటనలరా రకమునుపే॥ యు॥

పదునుటమ్ముల నెదగుదియించుచున్న మదనుని గదురుతనము

నన్నుఁ ద్రిదశలోకమున కంపునట్లున్నది కాని బ్రదుకనిచ్చునట్లు లేదే! ఏమి సేయఁగలను?

ఉ॥ రావుకులాబ్ధిచంద్రుఁడు సురప్రతిభాసురదేహుఁ డర్యుఁడున్
భావజరూపవిగ్రహుఁడు ఘన్యకులాబ్జమధువ్రతుండు సం
భావితమైత్రిపాత్రుఁడు కృపారసమూర్తి భుజంగరాయఁడో
భావహనామకుండునను భావజకేళినిఁ దేల్పరాఁడొకో॥

సీ॥ రాకున్న నేరీతిఁ బ్రాణముల్నిలుపంగఁ జాలుదునిఁక నిమేసంబు గాని
ప్రాణము నిల్పిన భావజతాప మెక్కరణి నే భరియింతుఁ గలతమాని
భావజతాపంబు భరియింపగల్గినఁ జేరాసపోవునే పెనగుఁ గాని
ప్రేరాసపోయిన నా రాముచిత్రముల్ మరపురానిచ్చునేక అప్పు,గాని॥

తే॥ గీ॥ మరపువచ్చినమాత్రాన మంతనంబు
విడువనేర్తునె యౌవనవేదనంబు
పట్టిపల్లార్చుచుండంగఁ బ్రాణసమితి
నిలుచునను మాటయనవట్టి నీళ్ళమూట॥

ప్రాణాసక్తిత్యజించిన మనసునకిట్టి సంకటములుండవు కదా? (ఆశ్చర్యము) ఆహా! ఇంతలోనే యింతతొందరపాటు నాకుఁ జెల్లునా? నా తెలిమికత్తెయగు సువదనను పంపియుంటిని యామె యేయుక్తియో పన్ని నా మనోహరుని నా కడకుఁ గొనితేఁగలదు.

సీ॥ డెందమా నీకు నానందంబు గలుగును
గొందలంబందకు జెందుశాంతి
హృదయమా వెఱవకు సదయుండు నినుఁ జేరి
ముద మొందఁగా జేయుఁ గొదువఁ దీర్చు
చిత్తమా భయమేల హృత్తటంబున నిన్ను
హత్తు నీ చెలికాఁడు కత్తలమున
మనమ భీతిలఁ బోకు మనసిజరూపుండు
కని నిన్నుఁ గూడి మంతనములాఁడు

తే॥ గీ॥ నీదుగాఢానురక్తియు నీదుచెలిమి
కత్తెతెలుపంగఁజనెనీనిమిత్తమిపుడు
సుంతయోర్పునుబొందుము వంతనొంద
నేలయురుదెంచె తప్పుఁగూడు కాలమిపుడు॥

ఏమో! నాలో నేను సరిపెట్టుకొనుటయే కాని యిదియంతయు జరుగునా? నామనస్తాపముతీరునా?

తే॥ గీ॥ నామనోహరుతోఁగూడి కామకేళిఁ
దేలుకాలంబునాకుఁ బ్రాప్తించుదాఁక
మదికినూరటజనియించి కుదటపడునె
ఘనతరంబైనకలతను గాంచుఁగాక॥

కలతనుగాంచుట నిక్కమే కాని ఫలముగనుటయదృష్టసాధ్యము వజ్రపంజరమునుబోలిన యీమాడుగుపై కతఁడెట్లురాగలఁడు?

క॥ శ్రీరామాసుతుఁబోలిన
యారావుకులీనుతోఁడ హర్షమునచుని
యారామమ్ముఁబొదలఁగలిసి
మాధాగమమునను దేలు మాంత్రిముగలదే॥

దయామయుండును ఘటనాఘటనసమర్థుండునగు నీశ్వరునికరుణనాయందున్నచో నీపని నెఱవేరకపోవునా?

ఉ॥ ఓపరమాత్మ! శంకరుఁడ! యోసకలాత్మసమానపోష మ
త్తాపముదీర్పఁగాఁదగును దారగుణుండు భుజంగరావుని
దాపునఁజేర్చితావులను దప్పఁగనుండిన నాదుప్రాణముల్।
నీపృథుశక్తిచేమరల నిల్పఁగవేడెద నాదరింపవే॥

(తిరిగిచూచి) అరుగో! నాచెలులిరువురును నామనోగతకార్యమును నెఱవేర్చి యిటువచ్చుచున్నారు ఎదురుగాబోయి యడిగెదను (అనిలేచుచున్నది)

(రమణి సువదనలిరువురును ప్రవేశించుచున్నారు.)

(ఎదుటకువచ్చి కవుఁగలించుకొని) సఖులారా కాయమా? పండా?

సువ—ఫలవంతమయిన నీమనోభూజమునఁ గాయలేలయుండును పండే?

సీతా—అటులయిన వచ్చియున్నాఁడా.

సువ—ఇద్దఱును గలిసివచ్చుచున్నారు.

సీతా—ఇద్దఱెవరు?

సువ—నీమనోహరుఁడును వానిసహచరుఁడగు పిదూషకుండును గలిసివచ్చుచున్నారు.

సీతా—(సిగ్గుతో) చేటీ తానువచ్చెడిపనికి పరపురుషునితోఁ గూడివచ్చుట కెట్లంగీకరించినాడే.

సువ—(నవ్వుచు) నీవుపూనుకొనినపనిని మాతోనెట్లు సంప్రతించి నెఱవేర్చుకొనుచుంటివో యట్లే.

సీతా—నాప్రాణసఖులరగు మీకునునాకు నభేదగుణ ప్రతిపత్తిగలిగి యుండుటచే మీకెఱిగించుట కొప్పుకొంటిని.

సువ—వారును ప్రాణస్నేహితులగుటచేతనే కలిసివచ్చుచున్నారు.

సీతా—చెలీ యాతనియెదుట నామనోహరునితో మాట్లాడుటకు సిగ్గుచే నోరురాదేమోయని భయమగుచున్నదిసుమీ.

సువ—మీరిద్దరును మాటాడుసమయము వచ్చుసరికి మావలెనే యాతడును దొలఁగును నీకాభయమక్కఱలేదు లెమ్ము.

సీతా—(సంతోషముతో)

తే॥ గీ॥ ఎన్నిజన్మము లెత్తిన ఋణముతీర్పఁ
జాలనంతటి సాయంబు సల్పినావు
నిన్నుఁబోలిన చెలికత్తెలున్న వనిత
కావయంతయు లోపంబు నావహిలునె॥

సువ—నీస్తోత్రపాఠములకేనర్హురాలనుగాను చెలిమికలయప్పుడొరుండొరులు సాయమొనరించుకొనుట విధికదా నన్నేటికగ్గించెదవు అదుగో నీచెలికాఁడు వచ్చుచున్నాఁడు స్థిరప్రయత్నముననీవుండుము

సీతా—ఏడీ నాకుచూపింపుము.

రమ—అదుగోకనుచూపు దూరమున నారాజమార్గము వెంబడిహితునితోఁగూడి వచ్చుచున్నాఁడు.

సీతా—అవునే మున్నొకసారి నేనీతని జూచినప్పటికంటె నిప్పుడుమఱియు తేజముఁగలిగి ప్రకాశించుచున్నాఁడు.

సువ—వయోవతివయి మదనావేశమునఁ జూచునీదృష్టికి నీవలపుకాడటులనే కనబడును లెమ్ము

సీతా—అటుకాదు నిజముగా వానికి తేజము హెచ్చినది.

తే॥ గీ॥ అతనిధీరతయాతని యందమతని
ముఖవికాసము వెడదఱొమ్మునుగనంగ
నమరనాయకుఁడో కాకకమలశరుఁడొ
యనుచుఁదోఁచెడు తనుకాంతి యమరియుండె॥

సీ॥ వానిప్రక్కను జేరి పరిహాసములనాడు
తరుణిభాగ్యమునెన్న తరముగాదు
వానికౌఁగిటఁ జేరి వదనంబుముద్దాడు
వనితమోదమునెన్న వశముగాదు
వానిపజ్జనుపండి బంధనారతిదేలు
వెలదిసౌఖ్యమునెన్న వీలుకాదు
వానిముంగిటనిల్చి ప్రణయోక్తులనుబల్కు
కాంతతీరెన్న శక్యంబుకాదు.

తే॥ గీ॥ వానిముంగురుల్ మునివ్రేళ్ళవలన దువ్వ
నతివయుల్లాసమెన్న సాధ్యంబుకాదు
మగువనీదైనచాతురీ మహిమచేత
నట్టిచెలికాసి పొందునా కమరనుండె॥

సువ—చెలీ యాతఁడు దగ్గరఁజేరక మునుపే నీలోనివయ్యారు చుంటివేమే? మనసు నంతగా బట్టజాలకున్నావు కాఁబోలు.

సీతా-అవునే అదేమికారణమో కాని నాశరీరము పులకాంకురమయి పట్టరానిసంతోషమునా మైకము గ్రమ్ముచున్నదే. కన్నులు మూసికొనివచ్చుచున్నవి.

సువ—అటులయిన నీతిన్నెపయిఁ బరుండుము మేమిరువురము నించుక
[illegible]

సీతా—(కన్నులుమూసికొని పరుండును.)

సుప—ఓసీరమణీ చూచితివా! దీనికి మదనతాపజ్వరమున నొడలెట్లు కాగుచున్నదో రమ్ము. మనము కొంచెము శైత్యోపచారముల నొనరించుదము.

రమ—(ఒడలు పట్టిచూచి) పాపమెంత వేడిగా నున్నది. నేనుబోయి మంచిగంధమునఁ బన్నీరు గలిపి తెత్తునా.

సుప—శీఘ్రముగాఁ గొనిరమ్ము. నీవు వచ్చుదనుక నేనుపచరించుచుండెదను.

సుప—అదుగో! భుజంగరావు తన సఖునితో ముచ్చటించుచున్నాఁడు. నేనీమరుగునుండి వీరిప్రసంగమును వినుచుండెదను. (అని ప్రక్కకుఁ బోవుచున్నది.)

(అంతయథోచితముగ భుజంగరావును విదూషకుఁడును బ్రవేశింతురు)

విదూ—ఏమోయి! భుజంగరావు! నీవ్యభిచారము కాదుగాని యూరంతయుఁ ద్రిప్పినది చాలక యీచెట్లచేమలలోని కీడ్చుకొనివచ్చి నామచ్చ మాపుచున్నావుగదా?

భుజం—సఖా! అంత యాయాసపడెదవేమి? నేనుమాత్రము నీతోఁ బాటు తిరుగుచుండుట లేదా? నాకులేనికష్టము నీకెట్లుకలిగినది?

విదూ—చాలు చక్కఁగాఁ జెప్పితివి వలపుడుకత్రియ నెప్పుడు చూతు మాయను నాతురమునఁ జిక్కములోని పిట్టవలెఁ గొట్టుకొనుచున్నమనసుగలిగిన నీకుదారియు డొంకయు మార్గాయాసమును గనఁబడుచున్నవా?

భుజం—మిత్రమా! యీమాటలకేమిగాని, యెంతమారము తిరిగి నను నాప్రియాంగన కానరాకున్నదేలొక్కో! మనము త్రోవతప్పి యుండలేదు కదా

విదూ—నేను జూపింతునుగాని నాకేమిచ్చెదవు?

భుజం—హితా! నీకుఁ గనఁబడినచో దయచేసి చూపింపుమా,

విదూ—నాకిచ్చెడిదానిఁ జెర్కొనుము. పిమ్మటఁ జూపించెదను.

భుజం—ఏమిచ్చెదనా? "నీకు మిత్రవత్సలు"డను బిరుదమిప్పించెదను. చాలునా!

విదూ—అబ్బా! ఎంతపనిని జేసెదవు. అదికాదు మంచిగారెలు, బూరెలు క్షీరాన్నములతోఁ గూడిన మృష్టభోజనమిప్పించెదవా?

భుజం—ప్రతిదినమును సత్రములలో కుత్తుకబంటి తిండిగల నీకింకను భోజనముమీఁదనే యాశయా?

విదూ—స్వకాంతాసంగమసక్తుఁడ వగు నీకుఁ బరకీయానురాగాశక్తి యెట్లో నాకుఁ బరభోజనాశక్తియట్లే.

భుజం—(తనలో) ఇతఁడు హృదయానారసమువంటి మాటను బ్రయోగించి నాఁడే కానిమ్మిప్పుడభిమానపడిన లాభము లేదు. (ప్రకాశముగా) వయస్యా! నీవాస్యోక్తులకేమి కాని యాచెలియను జూపుదునంటివే చూపుము.

విదూ—అదిగో! యాపుష్పవాటీరమునఁ గన్నులు మూసికొని పరుండియున్న వనిత యెవ్వతెయో చూడుము.

భుజం—(చూచి) అవును దూతికాభావమును వహించిన యీయాపె చెలిమికత్తె నాతో నెన్నిగురుతులు వచించినదో యవియన్నియు నీయువతియందుఁ గన్పడుచున్నవి. ఆహా! ఏమి యీ కురంగాక్షి యందము?

సీ॥ అపరంజిప్రతిమంబు నపహసించెడిమేని
శృంగారమును నేరి కెన్నతరము
బంగారుగిన్నెల పరిహసించెడిగుబ్బ
గవయందమెన్నఁగా నెవరితరము
పండువెన్నెలనవ్వు వనితాస్మితముఖాబ్జ
భాగ్యమెన్నుటకు నెవ్వారితరము
స్మరచాపములనేలు తరళాక్షికనుచూపు
తెరఁగెన్నుటనఁగ నెవ్వరికిఁదరము॥
తే॥ గీ॥ ఎన్నిజన్మములెత్తిన నిట్టిబోటి
తోడమంతనంబులనాఁడ గూడునొక్కొ.

పూర్వభవపుణ్యఫలమునఁ బొసఁగెఁగాన
జన్మసాఫల్యములభించె సవ్యముగను॥

విదూ—హితుఁడా! యారామామణి నీవంకఁగన్నైనన్తి చూడక మునుపే నీవిట్లుమనఃకల్లోలము నొందుటచూడ నాకు మిక్కిలివింత యగుచున్నది "ఊరిముందఱికివచ్చినపిమ్మట నుఱుకులు, బరుగులు" ననునట్లు నీకిప్పుడు తొందరపాటుకలిగెనా, మనస్థిమితమును గనఁజాలవా.

భుజం—అట్లుకాదు ఈవిషయమునీవనుభవసిద్ధముగా నెఱుఁగమినిట్లనుచున్నావు కాని సుందరవిగ్రహయగువనితారత్నమును గాంచినప్పుడు వారియొక్క.

చ॥ ఘనకుచయుగ్మముల్ దళుకుఁగన్నులుఁ జంచలమైనదృష్టులున్
ననవిలుకానివిండ్లవలెనభ్రములౌ కనుబొమ్మలున్ శశాం
కునిఁబోలుమోము చూపరులకున్ గడుమోదముగూర్చువేణియున్
మిసమిసలాడుదేహమును మింతులమానసమున్ హరింపవే?॥

విదూ—మనస్సునుహరించినంతమాత్రమున నుచితానుచితముల నెన్నకవెంబడి కులకాంతలనంటఁబ్రయత్నించు టెట్టితగవు.

భుజం—ఇందనుచితమేమున్నది.

ఉ॥ మోమునఁబుట్టు లేనగవు ముద్దులుగుల్కు మృదూక్తులున్ భళీ
తామమునించు చూపులును ఘల్లుఘల్లుమనఁ మ్రోగెడునూపురధ్వనుల్
కోమలదేహసౌరభముఁ గూడినయాయభిసారికామణీ
స్తోమముఁగూడఁ గాముకులు చుట్టునుద్రిమ్మరు టొప్పదేసఖా॥

సువ—(సీతారత్నమును సమీపించుచుఁదనలో) నాదూతికాకృత్యము చక్కఁగా ఫలించినది ఇఁకసత్వరముగా చెలికత్తెను మేల్కొలుపుదునుగాక (లేపుటనభినయించి) సఖి! ఘోరసూర్యరస్మికృత ముకుళీభూతనయననీలోత్పలములు ప్రియచంద్రదర్శనానంతరమేనియు వికసింపకున్నవేల లెమ్ము.

సీతా—(లేచికన్నులు నులిమికొనుచు) ఇదేమే ఇంతదనుక నాచెంత

మెలంగుచున్న నా చెలికాఁడు కన్నుఁ దెఱచునప్పటికే మాయము యినాఁడు.

సువ—కలగంటివి కాఁబోలును.

సీతా—నిజముగా రానేలేదా.

సువ—ఇచటకువచ్చియున్నాఁడుగాని నీచెంత మెలఁగినాఁడనుట కలయే.

భుజ—వయస్యా! వీరిప్రసంగమువలన నావలెనే యీయెయు మదనావస్థలోనున్నట్లుస్పష్టపడినది యింకయు నేమి చెప్పుకొందురోవిందము

విదూ—"పాములజాడపాములది సాములజాడసాములది" నీవింతలో వారి ప్రసంగము నెట్లువింటివి.

భుజం—నిశ్శబ్దముగానుండుము వారిపలుకులను విననిమ్ము.

విదూ—అప్పుడు చక్కఁగాఁజెప్పితివి "గడచిన గండఁడుమిండడగు" ననుసామెతవినలేదా.

భుజం—(విసువుతోఁ) మిత్రమా క్షమించి యూరకుండుమా.

సీతా—ఏడీ.

సువ—అరుగో యా పూలచెట్టు చాటునున్నారు. ఇఁకనీప్రయత్నము న నీవుండుము. నేఁబోయెదను. (నిష్క్రమించుచున్నది.)

సీతా—తొంగిచూచి సిగ్గుతోఁ దొలఁగుచున్నది)

భుజం—విదూషకా! చూచితివా నీవుకూడ నుండితివనుట సూచింపుటకై సిగ్గుచే మరుఁగయినది. అహా యామె యెంతప్రౌఢ.

విదూ—యీ పాపకర్మమునకు నేనొడిగట్టుకొననేల? నేనవతలకేగెదను నీప్రయత్నమున నీవుండుము. (నిష్క్రమించుచున్నాడు.)

భుజం—(సమీపించి)

మ॥ అతివా! నీదనుదర్శనార్థమయి మాగారయాసముల్ జూడకే
నతిసంతోషముతోడవచ్చితిని నీదా కౌఁగిటంజేర్చి స
త్కృతిసేయందగు నింకనేనిఁ బరమార్థీభూత చిత్తమ్మునన్
శతపత్రాంబకు బారినుండి దరిజేర్పన్నిన్నుఁ బ్రార్థింతుఁ జేడె॥

సీతా—(ముందునకువచ్చి.)

చ॥ ఇతనితనూవిలాసమున కీడగుఁబల్కుల తీరుదానికిన్
జతయగుఁజాతురీకలన చాతురికన్నను మారశాస్త్ర పాం
డితియధికంబునంతకుఁ గడిందివయోవిభవంబు దానిచేఁ
బ్రతియభిసారికామణికిఁ బ్రాణవిభుండనఁ జెల్లునీతనిన్॥

మనముననెంత తత్తరపాటొదవుచున్నను నోట సమాధానము జెప్పుటకు సిగ్గగుచున్నది. (సిగ్గుచేఁ దలనొంచుకొనుచున్నది.)

భుజం—(తనలో) మిన్నకతలవంచుకొని యూరకున్నదేలకో! ప్రౌఢయై యుండబోలు. కావుననే నిరుత్తరమే యంగీకారసూచకమని తెల్పినది. అయిననింకొక్కసారి యడిగిచూచెదను (ప్రకాశముగా)

మ॥ పలుకేబంగరమా మృగాక్షి! పిలువం బల్కాడకున్నావు నా
వలనన్నేరము గాంచినావా ననుసంభావింపఁ గానెంచవో
యలుకంబూనితివో చలోక్తికయి హాస్యప్రియమ్ముల్ జూపవో
చలముంబూనక ప్రేమఁజూడుమికఁ నాజన్మంబు సాఫల్యమా॥

మఱియు.

ఉ॥ ఎందఱు పూరుషాగ్రణులు నెందఱుసుందరరూపవంతులిం
కెందఱుగొప్పవారు కలరిందఱిఁ గోపలనేరినట్లు నా
యందుననీకు మోహమది యబ్బుటనాదగు భాగ్యరేఖయే
సుందరి! చెంతఁజేర్చుకొని సూనశరాగమముల్ స్మరింపవే॥

సీతా—(తనలో) అకటా యెంతయని యోర్చుకొందును. సిగ్గేటికివ్యక్తీకరించెదఁగాక (ప్రకాశముగా)

తే॥ గీ॥ స్వాతివానకు ముత్తెపుం బరణియట్లు
నిన్నుఁగోరుచు గాలంబు నెన్నుచున్న
నాకుదర్శనంబిచ్చి సంతసముగల్గఁ
జేసితివెయింకఁ గొదవేమి చెలిమికాఁడ॥

భుజం—(తనలో) ఇప్పటికిగదా ధన్యుఁడనయి పడినపాట్ల కెల్లఫలము నుగాంచితిని. (ప్రకాశముగా)

తే॥ గీ॥ పూర్వభవమందుఁ జేసినపుణ్యమునను
నీదుదర్శనభాగ్యంబు నెమ్మిఁగలిగెఁ

గానినీదయకలిమిచేఁ గమలశరుని
కేళిసంప్రాప్తమగుఁగాక నీలవేణి॥

రాగము— ఏకతాళము.

(తప్పు క్షమియింపుమయ్యమట్టు)

సీతా—ననుఁగృపజూడుమయ్య నాయకనీదాననయ్య
వనవిలుకాని కేళిఁగనఁగఁజేసి మనుపుమయ్య॥ నను

భుజం—ఘనముదమయ్యె నేడు వనజపత్రనేత్రనాకు।
తనరునీదు యావనంబు తద్దయునాపాలుసేయ॥ ఘన

సీతా—ప్రమదవనమధ్యమందు భాసిలుమందిరమునందు
విమలమణిస్థగితమైన వేదికనలంకరించి నను

భుజం—ఇందునిన్ను గూడియున్న మందయానతంద్రినన్ను
బంధనాలయంబుసేర్చి బాధవెట్ట నెంచునేమొ॥ ఇం

నీవన్ని విషయంబుల నాకుఁ దోడ్పడియుందునని వాగ్దత్తముసేయుము నిక్కముగా నిన్నే కూడియుండెదను.

సీతా—(తనలో) నేనుతనమాట జవదాటుదునేమోయని సందేహించుచున్నాఁడు కాఁబోలును (ప్రకాశముగా)

తే॥ గీ॥ మనమునందుననిను దైవమనుచుఁదలఁచి
జీవితాంతముదనుక నీచెంత మెలఁగు
చుందుదాననునుఁడి విభవోన్నతగతి
నన్నుఁగైకొమ్ము నీకుఘనమ్ముగలుగు॥
(అనిచేతిలోఁ జేయివేయుచున్నది.)

భుజం—(తనలో) అన్యాయాలతాతన్వి చేతఁజేయిడినన్ను స్పృశించినంతమాత్రముననే విరహజ్వరమునఁ గాగుచున్న నాశరీరము సమశీతలభావము వహించినదికదా (ప్రకాశముగా)

తే॥ గీ॥ ఎట్టికష్టములులిగిన నిందువదన
సుఖములైతోఁచునినుఁ గూడుచోనవన్ని

పాలెగానికి వ్యవసాయ ఫలముగన్న
దున్నుకష్టంబు మదిలోనఁ దోఁచనట్లు॥

(అనిసీతారత్నము పైనఁజేయిడి) నెచ్చెలీనీప్రమదవన విశేషంబుల నాకుఁ జూపించెదవురమ్ము.

మలయమారుతము ఆటతాళము.

(కాంతకాంత లతాంతములు మట్టు)

సీతా—మల్లెమొల్లలు నల్లుకొని పందిళ్ళుసౌరభమెల్లమదిరం
జిల్లఁజేయుచున్నవిమనో వల్లభాయిటు చూడుమీయెడ॥ మ
భుజం—కమలనేత్ర ప్రమదవనశృంగారమింతని చెప్పశక్యమె
యమరవిభునినందనోద్యానమును దీనికిసాటియగునే॥ కమ
సీతా—మంచిగంధపుఁ దరులుమఱి చేమంతి మొక్కల బోదెలుఁగ
మంచివాసనల పరిజిమ్ముచు మదికిముదమును నొదవజేసెడి॥ మ
భుజం—అతివ! వనమందిరములోపల ననమశరకేళిఁవసింపఁగ
నతిముదంబునఁ జేరఁబోవుదమాలసింపక రమ్ముపోదము॥ అతి॥
(ఇద్దఱునిష్క్రమింతురు)

అంత యధోచితముగ రమణిసువదనులు (ప్రవేశింతురు)

రమ—మన చెలికత్తె కనుపించదేమే మదనతాపరహిత మయిన దా యేమి ?

సువ—నీచేతిలోనిది గంధపు గిన్నె యేనా ?

రమ—అవును.

సువ— ఇంత త్వరగా వచ్చితివేమి.

రమ—ఆ నీకేమి ? ఎగతాళి వ్యాపారము చేసెదవు. అక్కడ ఎంతగం ద్రగోళమయినదో నీకు తెలియున్నా ?.

సువ—ఏమిజరిగిన దే.

రమ—ఏమిజరిగినదా గుట్టు బయటఁ బడినది.

సువ—ఎవరిగుట్టు.

రమ—మన సీతారత్నము గుట్టే.

సువ—ఎట్లు తెలిసినది.

రమ—ఎవరు చెప్పిరోకాని పూసలు గ్రుచ్చినట్లు కథయంతయుఁ దెలిసినది. భుజంగరావును బట్టుకొని తగు ప్రాయశ్చిత్తము చేయవలయునని వణిక్ప్రతియు నాతని కొడుకును గూడ ప్రయత్నించుచున్నారు.

సువ—చాలును లెమ్ము. అతఁడు వీరియట్టివారిని లెక్కపెట్టునా కడు సాహసము కలవాఁడని నీవుమాత్రమెఱుఁగవా ?

రమ—ఎవరికెంత సాహసమున్నను ప్రభుత్వమువారికి లోఁబడవలయునుగదా యితఁడేమి చేయఁగలఁడు.

సువ—వలసినచో నితనికొఱకు గావలసినంత ద్రవ్యము వెచ్చించఁగల స్నేహితులితని కనేకులున్నారు.

రమ—సరే మనమింటికిఁ బోదము రమ్ము మనకిందులో సంబంధమున్నట్లు తెలిసినచో మన సంసారములకుఁ జేటుగల్గును.

సువ—అవును. నిజమే పోవుదము.

(నిష్క్రమింతురు.)

ఇతి శ్రీమత్కాశినాధుని వీరమల్లయారాధ్య
విరచిత సీతామనోహరనాట
కంబున ద్వితీయాంకము.

(శ్రీ)

శుభమస్తు.

సీతామనోహరము.

తృతీయాంకము.

(వణిక్పతియు సోముఁడును బ్రవేశించుచున్నారు.)

వణి — కుమార, కులమున కెన్నఁడెఱుఁగనిముప్పు సంభవించినదికదా యీపెద్దమ్మ నాకడుపునఁ జెడబుట్టినది.

సోము — ఏమి వైపరీత్యము సంభవించినది?

వణి — కావలసినదంతయు నయినది ఇంకేమికావలయును నాపరువు ప్రతిష్ఠలన్నియు నట్టేటగలిసిపోయినవి.

తే॥ గీ॥ నీదుపెద్దచెల్లెలు సీతనీతివిడచి
మిండగానిని జతఁజేర్చి మెలఁగుచుండె
ననుచువింటిని నొసట నావనజభవుఁడు
వ్రాయుగీతను దప్పింపనశమె మనకు॥

సోము — ఎంతనుకొంటిమో యంతయు సంభవించినది యిప్పుడు చింతించి నంతమాత్రమునఁ బ్రయోజనమేమి.

ఉ॥ నెత్తిననోరుపెట్టుకొని నీవిటుసేయకుమంచుఁ జెప్పినన్
జిత్తమునందుఁ జేర్చకటు సేసినపెండ్లికివచ్చెఁ దిప్పలీ
పత్తనమందనన్ గులమువారలలోపల సిగ్గుచే శిరం
బెత్తుటకేనివీల్పడని హీనతకగ్గెఁగదా చిరంబుగన్

తగినవరునిఁజూచి పెండ్లివిగావించినచో నిట్టిపాటురాదుగదా అప్పటి మీమూర్ఖతయే యిప్పుడిట్లు పరిణమించినది. కానిమ్ము.

ఉ॥ మించినదానిఁగూర్చియిటు మిమ్మనిసందునలాభమేమి యీ
వంచనఁ జేసినట్టి మనవైరికి నేగతిబుద్ధిసెప్పఁగా

నెంచితిరో బిరానవచియింపుడు వేగమె వానిని న్నిరో
ధించకయున్నఁ జేటగును దిట్టపుఁబన్నికఁ బన్ని చెప్పుమా॥

కొండొకనేరముఁగల్పించి వానిని శిక్షింపఁజేయకున్న మరింత గావృద్ధియగును కావున బాగుగా యోచింపుఁడు.

వణి—(తనలో) వీఁడు నాకంటె నెక్కుడు క్రౌర్యముఁనుబూనియున్నాఁడు కాని యాతులువకుఁదగిన ప్రాయశ్చిత్తము సేయించవలసినదే యిట్లగుఁగాక (ప్రకాశముగా.)

ఉ॥ గతజలసేతుబంధనము కార్యములేదు నిదానమున్నచో
నితనికిఁ దగ్గశిక్షవిధియించెడు మార్గముజూడవచ్చు దొం
గతనము సేయఁగా మనయగారము సొచ్చెనటంచుఁ బన్నియా
వితమునుబంటు జాతులకు వెల్లడిచేయుట యుక్తమియ్యెడన్॥

మఱియు,

తే॥ గీ॥ అట్లు చేసిన తత్క్షణమతనిఁబట్టి
బంధనాలయమందుంచి పరిభవించి
బుద్ధిసెప్పుదురాపైన మూర్ఖతముని
న్యాయసభలో విమర్శింతు రమలమతులు.

సోమ—తండ్రీ! అది యక్రమప్రథానువర్తనులకు లక్షణముగాని మనయట్టివారలకు గాదు. ఇటుఁవినుడు

చ॥ అనృతముబన్ని న్యాయమును నావలబెట్టి వృథాగవ్యాజ్యమున్
జొనిపినమాత్రనేగతిని సూనృతవాక్యవిహీనమైన వ
ట్లను జయమొందజాలుదుము లాతిజనంబులు నవ్వి పోరె యో
డిన నిజమేలదాఁచవలె డెందమునందునఁ జింతసేయుఁడీ॥

ఇంకొక్కటిగూడ నాలోచింపుఁడు.

తే॥ గీ॥ నిజముఁజెప్పిన వ్యాజ్యంబు నిలుచు మనకు
ననృతమాడిన గెలుపెట్లు లరయఁగలము
"సత్యమేవజయతి" యన్న శాస్త్రవిధిని
మీరుమాత్రమెఱుంగరే మృషలభాష॥

వణి—ఓరి పిచ్చివాఁడా! ఇటువినుము.

ఉ॥ కూతురుఱంకుఁ జేసెనని కొండొకసిగ్గును లేక యేగతిన్
సీ! తలయెత్తి చెప్పుదును జెప్పిననేగతి వారునమ్మఁగాఁ
జూతురు పిన్నపెద్దలు ననూయతనూపరె! పెక్కులేల? నా
జాతకమిట్టులుండఁగ విచారణసేసిన లాభమేమొకో॥

అనియును గాక,

తే॥ గీ॥ పూర్వకృతపాప మీరీతి గర్వభంగ
మును బొనర్చుచునుండంగ మనమునందు
జింతనొందుటచేత నానంతయేని
విడిచిపోవునె ఫలితంబుగుడువకుండ॥

సోము—(తనలో) పట్టుదలనువిడిచి వైరాగ్యములోనికి దిరుగుచున్నాఁడు. ఇప్పట్టునఁ గొంత ప్రోత్సాహ మొనరింపవలయును. (ప్రకాశముగా)

తే॥ గీ॥ మీరు మీలోనఁగుందిన మేలుకలదె
తగునుపాయముచేత నాతనిని వంచ
నమ్ముసేయక యున్న ఫలమ్ము వమ్ము
పాపులకుశిక్ష లేకెట్లు వచ్చుబుద్ధి॥

కావున మీరీవిషయమునఁ దగుప్రయత్నముసేయుటయే యుక్తమని నాయభిప్రాయము. పిమ్మట మీయిష్టము.

వణి—(తనలో) వీఁడు చెప్పినదంతయు యథార్థమే "తోటకూర నాఁడే చెప్పవైతివేమిరా" యన్నట్లు ప్రప్రథముననే యీదుర్నయుని నడఁచివేయవలయును. (ప్రకాశముగా)

తే॥ గీ॥ అయినఁగానిమ్ము వాని దురాగతమ్ము
నకుఁ దగినశిక్ష వేయింప న్యాయసభకుఁ
బోయివచ్చెద పనిఁబూని ముందునీవు
నాదురాత్ముని బోకుండ నాపుమిచట॥

సోము—చిత్తము. ఆపని నవలీలగా నొనరించెదను.

తే॥ గీ॥ పూవుఁదోటను జేరి యాముగ్ధకాంత
మనము సెడఁగొట్టి యా పితో మంతనమ్ము
లాడుచున్నట్టి ఖలుఁబట్టి యతని హస్త
ములను బెడఁగట్టియుంచెద బోయిరండు॥

తండ్రిగారు! ఇంకొకమాట,

చ॥ ధన మొకయింత హెచ్చయినఁ దప్పక వ్యాజ్యము గెల్చునట్లు గాఁ
బనిఁగొను న్యాయవాదిని వివాదము సేయఁగ నిర్ణయించి, దీ
నినిఁ దనస్వంత కార్యముగ నెమ్మిఁ దలంచు మటంచు వేడి గొ
బ్బునఁ బురరక్షకాధిపుని ముందిటకుం గొనిరమ్ము వేగమే॥

వణి — అదిఅంతయు నేనెఱుఁగుదును లెమ్ము. నీవుమాత్రము వానినిఁ బోకుండ నెదిరించియుంచుము. పదిడబ్బులు పోయినను బురరక్షకస్థానాధిపతినిఁ దీసికొనివచ్చి యితనిఁ గొట్టులోఁ బడవేయించెదను త్వరగాబొమ్ము.

సోమి — చిత్తము. (ఇరువురును నిష్క్రమింతురు.)

(అంత యథోచితముగ సీతారత్నమును భుజంగరావును ప్రవేశింతురు)

భుజం — మనోనాయకీ! నేడు మనము విన్న విచారకరమగు వార్తవలన నామనము కలతనొందుచున్నది. అనతికాలవ్యాపితమైన మన మోహలతానికుంజమును ఛేదించుటకు నీతండ్రి యనూయాలవిత్రపాణియై బయలుదేరినాఁడు కదా! మనము పరస్పరవియోగమున బ్రతుకఁగలమా?

సీతా — మీకీ వెఱ్ఱియేటికి? మన మోహబంధము పరప్రయత్నమున నేర్పడినదా, పరప్రయత్నముచే విడఁగొట్టఁబడుటకు ఎవరెట్లువిఘ్నము సేయఁదలచినను జీవితాంతముదనుక మనచెలిమి వీడిపోవదని యే నాయభిప్రాయము.

భుజం — అంత స్నేహమెక్కుడుగానున్న దానికిఁదోడుగా నేకస్థలనివాసార్హతయున్నచో మనస్థిమితముండునుగాని లేకున్న నీయనురాగము నిష్ఫలమేకదా!

సీతా.— మనము ముందుగనే భయపడనేల?

తే॥ గీ॥ జరుగనున్నది యెట్లైన జరుగుగాని
చింతనొందినదీరునే సిలుగులెపుడు
కష్టసుఖములు కావడికడవలన్న
సామ్యమును మున్నువినలేదె సన్నుతాంగ?

తే॥ గీ॥ మిన్నువిరిగి పైఁబడనున్నఁ గన్నతల్లి
దండ్రు లెన్నెని విధముల దలఁకి నన్ను
శిక్షఁ జేసినఁగాని నీచెలిమి విడువఁ
గట్టిగానమ్ము మిది మనఃకమలమందు॥

భుజం—(తనలో) ఏమి యీమెసాహసము మనోనిశ్చయమన్న నిట్లుండవలయు. ఇంతధైర్యము పురుషుఁడనైన నాకుఁగూడలేదు స్త్రీజనులే సాహసకృత్యములందుఁ బ్రథమగణ్యలు. (ప్రకాశముగా) ప్రాణేశ్వరీ!

మ॥ పరితాపంబిసుమంతయేనియు మనఃపద్మంబునం లేదు సుం
దరి నీపల్కుల మాధురీమహిమ చేతన్ మాయమైపోయె, నీ
కొఱకై ప్రాణము లైనఁ బాసెదను నాకుంగార్యమా సన్న మా
తఱిసిన్ సాయము సేయఁగావలెసుమీ దైన్యంబురాకుండఁగన్

మఱియు,

తే॥ గీ॥ ఎట్టిపన్నికపన్ననో యేమొనన్ను
వంచనమ్మునుసేయఁగ వనితనీదు
తండ్రి, దాసికిఁదగిన పద్ధతినిఁబన్ను
కొనఁగ వలయుఁగావున బోవ ననుమతిమ్ము॥

సీతా—(తిరిగిచూచి) నాథా! నాచెలిమికత్తెయగు సువదన యిటువచ్చుచున్నది. ఆమెవలనమనము కొన్నివిశేషములను దెలిసికొనవచ్చును.

సువ-(ప్రవేశించి తనలో) అకటా! వీరిరువురును వేటకానికెదురయ్యెడుహరిణయుగ్మమువలె నిచ్చటనేయున్నారే! పిలిచిచెప్పెదనుగాక.

(ప్రకాశముగా) చెలీ! యొకసారియిటురమ్ము

సీతా—(సమీపించి) విశేషము లేమేని జెప్పెదవా?

సువ—చెప్పెదనురమ్ము (చెవిలోఁ జెప్పుటనభినయించు చున్నది)

సీతా—అటులనా? నేనిప్పుడే వచ్చెదను నీవు ముందుగా బొమ్ము.

సువ—మంచిది. (నిష్క్రమించుచున్నది.)

భుజం—(సీతారత్నముదగ్గరకువచ్చి) ప్రేయసీ! నీచెలిమికత్తె యేమని చెప్పినది. మనముకోరిన్న దానికేమైన భిన్నమున్నదా?

సీతా—ఏమియు భిన్నములేదు. మీతోఁ గలహించుటకై నాసోదరుఁడు వచ్చుచున్నాఁడట నీవెంతమాత్రమును భయపడవలదు. నీపైనఁ దెచ్చెడు వ్యాజ్యమునకయ్యెడు ధనమంతయు నేనిచ్చెదను ఇట్టిసమయమున మనమిరువురము నొకచోటనేయుండుట కర్జంబు గాదు, నేను బోయివచ్చెదను. (నిష్క్రమించుచున్నది.)

భుజం—తుదకునాకు గళబద్ధరోగము సంభవించినది. ఇఁకేమిసేయుదును.

సీ॥ మగువవాఁడు సమాగమంబుగోరినమాత్ర
మదివిచారణలేక మరులుకొంటి
మరులుకొంటినె చూడు మగనాలిగృహమందు
నడుగువెట్టితి సంశయంబులేక
నడుగువెట్టిననేమి యప్పుడేక్రమ్మరిపోక
మంతనంబుననుంటి నింతదనుక
నుంటినే చూడుమీ యింటిలోపలగూఢ
వృత్తినయ్యదివారి కెట్లు తెలిసె

తే॥ గీ॥ తెలిసెనమ్మాట వినినంతఁ దెలివిగలిగి
గోడదాటక నెచ్చెలితోడ మాట
లాడి యాలస్యమును జేసి హానితెచ్చు
కొంటి మేలానె వ్యభిచారకులకు నెందు॥

ఇట్టిపనులచేత నేకదా భిన్నాభిప్రాయులై జనులలోఁ గొందఱు పరస్పర కలహపాత్రులగుచున్నారు.

చ॥ కులటలఁ గూడునప్పుడె ప్రకోపముఁ గల్గును నొండొకండు దనుఁ
గులవనితాళిఁ గలియఁగోరినయప్పుడు దానితల్లి దం
డ్రులు సహియింతురే! మదివిరోధముఁ బూనక మూఢవృత్తి నీ
వలఁదగులొందినాఁడ బొరపాటును జేసి కృశింప నేటికిన్॥

దూరాలోచన లేక బహుజనదూష్యంబగు నీయకృత్యంబును బుద్ధిపూర్వకంబుగా నొనరించి పైనిపుడు చింతించుట గతజలసేతుబంధనము కాదా! ఇప్పుడు తప్పించుకొనిబోవు మార్గమాలోచించవలయును.

తే॥ గీ॥ మొదట యోజించి మెలఁగుట ముఖ్యమందు.
మించిపోయినతరువాతఁ గించవడక
తప్పుకొనుమార్గమును జూచుటొప్పునదియు
వీలుగాకున్న నెదిరించి వెడలవలయు॥

(తెఱలో)

(చ॥ పరువుప్రతిష్ఠలన్ విడిచి ప్రల్లదుఁడై గృహమందుఁ జొచ్చి కా
వరమున దుష్టకార్యమని భావమునన్ గణియింపకుండఁ ద
స్కరునివిధంబునన్ జెఱుతజవ్వనిమానసమున్ హరించి నే
డరమర లేక చిక్కునధమాధమునిన్ బలియిత్తు భూమికిన్॥)

(ఆలకించి) (క్రోధావేశుఁడై సోమయ్య యిటువచ్చుచున్నాఁడు. అకటా! అనుకొనినంతయు జరిగినది. ఇపుడేమి సేతును? ఏపనిఁ జేయుటకును మనోజవము తగ్గిపోవుచున్నది. దోషకృత్య మొనరించినవారికి మనస్థిమిత మెక్కడనుండివచ్చును? (యోజించి) ఇతఁడు తిరిగివెళ్లుదనుక నిందే యెచ్చటనైన దాగియుండెదను (చాటున నిలుచును.)

సోమ — (ప్రవేశించి కోపముతో.)

చ॥ పరువుప్రతిష్ఠలన్ విడిచి ప్రల్లదుఁడై గృహమందుఁ జొచ్చి కా
వరమున దుష్టకార్యమని భావమునన్ గణియింపకుండఁ ద

స్కరనివిధంబునీ జిఱుత జవ్వనిమానసముఁ హరించి నే
డరమరలేక చిక్కు నధమాధమునిఁ బలియిత్తుభూమికిఁ॥

(అటునిటుచూచి) ఏడీ! యెచ్చటను గనఁబడకున్నాడేమి? చేసినతప్పు మనసునకెక్కినది కాఁబోలును.

తే॥ గీ॥ చిరతరాభ్యాసమునను నీవరుగుచుండు
వారవనితల గృహముంచు వచ్చియుంటి
వేమొ నీపాట్లఁజూపింతు నిపుడురమ్ము
దాగియుండిన నీచావు తప్పఁబోదు॥

(కోపముతో) ఓరీ! పాపవిచారా! నయవిదూరా! ఏమూలనక్కియుంటివో బయల్పడకున్నావేమిరా?

తే॥ గీ॥ దరియఁదెన్నునుగానక తల్లడిల్లి
ప్రాణభీతిని నెందేనిఁ బరువువిడిచి
కంటఁబడకుండఁగా దాగి యుంటివేమొ
శూరగుణధాము జితసోము సోముజూచి॥

ఉ॥ ఇవ్వెడఁగాదుఘోరవని కేగిభయంబున డాగియుండినన్
న్యాయ్యమువీడినట్టి మనుజాధమునిఁ బరిమార్చకుండ నా
దయ్యమువృద్ధినిచ్చునొకొ తప్పకదైవమొ లేకమేమొ సా
హాయ్యముసేయవచ్చెదు భటాళియొ నిన్ను వధింపకుందు మే॥

తక్కినవారిమాట లిప్పుడేటికి? ముందుగ నేనీపనికై వచ్చియుంటినికదా? ఆదుర్మార్గశిఖామణి యీదివ్యభవనంబున నేమూలను డాగియున్నాఁడో చూచెదనుగాక ఇంతలోఁ దండ్రిగారుకూడ వత్తురు (అని నలుదెసలను వెదుకుచు లోనికిఁబోవుచున్నాఁడు.)

భుజం—(ప్రవేశించి) వీనిమాటలనుబట్టిచూడఁగా నిది సామాన్యముగాఁబరిసిపోయెడునట్లు కనుపించుటలేదు. నేను భయపడినట్లు వీరు కనుఁగొనినచో నన్నుమరింత ధిక్కరింపఁజూచెదరు కావున నిర్భయముగానుండవలయును.

సోమ—(పరుగెత్తుకొనివచ్చి విటుని చేయిఁ బట్టుకొని)

ఉ॥ ఎచ్చటికేగుచుంటివిర యెంగిలిమెక్కెడి కుక్కరీతి నిల్
చొచ్చితివింక నేను వెనజూడక నాదగుతల్లిదండ్రులు
న్మెచ్చునటుల్ పొడింబొడిగ నిన్నిటఁదన్నెద, నామిషంబుకై
మచ్చము గాలముంగదగులు మాడ్కి నీఁ జేతికిఁజిక్కినావురా॥

భుజం —(తనలో) ఓహో! వీనివదరుబోతుతనము హెచ్చుగానున్నదే కానిమ్ము నేనే యించుకయోర్పు వహించెదను.

సోమ — కానిమ్ము నీకు కాలముసమీపించుటనుబట్టియే యిట్టిదుర్బుద్ధి యుత్పన్నమైనది.

తే॥ గీ॥ సద్దరాలిని నెట్టుల్లో మోసగించి
యొద్దఁజేరితివోర నీయూహకేమి
కాని యాసైంధవాదులౌ కాముకులకుఁ
గలిగినట్టి సౌఖ్యమునీకుఁ గలుగుగాక॥

భుజం — చాలు నిఁక నోరుమూయుము సిగ్గుచేఁ దలవంచుకొనక తగుదునని మాటలాడెదవేల?

సోమ — ఏమీ నోరుమూయవలయునా?

ఉ॥ మట్టెద, నేలఁ బెట్టెదను మాయిలుసొచ్చిన నిన్నుఁ గాలితోఁ
దట్టెదఁ బాపకార్యపువిధంబును బూను దురాత్మ నిన్నునున్
మొట్టెద నింకనెచ్చటికిఁ బోయెదవోరి, పరాంగనామణిన్
ముట్టిన వాఁడెవచ్చితివి మూఢకులాధమ కాచుకొమ్మికన్॥

భుజం — ఊరకొనినకొలఁది నీకు నోరుహెచ్చుచున్నదిగా! ఓ ప్రేలరీ నీవాచాశూరత్వమునుజూచి యిచ్చట భయపడువారెవరును లేరు. మర్యాదగా విరమింపుము.

సోమ — నీయంతము కనుఁగొననిదే విరమించువాఁడీ సోముడుకాఁడు. టక్కరిమాటలతోఁ దప్పించుకొని పోవలయునని ప్రయత్నించుచుంటివి కాబోలు నట్టి ప్రయత్నములు నాయొద్ద సాగవు.

భుజం — మూఢుఁడవగుటచే నట్లనుకొనుచుంటివి. నేను స్పష్టముగాఁ జెప్పెదను వినుము.

ఉ. నీదగుసోదరీమణికి నెయ్యముసూపెడు బావనైన నా
మీఁద ననూయఁజూపుటది మేలటరా పదిమందిలోన దా
యాదులు నవ్విపోదురని యైనను గుట్టున నుంచుకొక నీ
గాదిలిచెల్లి గేలిపడఁగా నిటురట్టొనరింతువే ఖలా!

సోమ—ఓరివాచాటా! అంతఃపురజనవిటా!

ఆ॥ వె॥ ఆఁడుదానిపొల్కి నంతరంగములోన
నదరుపుట్టుచుండ నడఁచిపెట్టి
పైకిబెరములను బల్కనేటికిమూర్ఖ
నోరుమూయుమింక నుడువులేల?

భుజం—అరే! మూర్ఖాగ్రేసరచక్రవర్తీ!

సీ॥ అనదయాజామాత నంగీకరించిన
నీతండ్రిమగలింపఁ జేతకాక
పెండ్లియాడినయట్టి పెండ్లాముసంతోష
పఱపనిబావతోఁ బల్కలేక
మదనార్తిఁ జేఁజాల మఱిగి వేఱొకభర్తఁ
జేరినచెల్లికిఁ జెప్పలేక
కులపుమర్యాదను నిలుపజాలనినీదు
చిత్తవృత్తికి బుద్ధిసెప్పలేక

తే॥ గీ॥ నిప్పుఁదొక్కిన కోతినాఁ గుప్పిగంతు
లిడుచు నన్నుదూరెదవేల హీనగుణుఁడ
కట్టిపెట్టుము చాలు నీగుట్టుబయట
వేసికొనుచుంటి విదియెంత వెఱ్ఱితనమొ॥

సోమ—కుటిలహృదయా! నీ నీతికి జాలసంతసించితిని, నీవుచెప్పినదాని
కంటె సిగ్గువిడిచి నీవు మాటలాడుచున్నందుకు నాకుసిగ్గగుచు
న్నది.

చ॥ చదివితి వేమిసార్థకము సద్గుణముల్గలిగించు విద్య నీ
హృదయమునందుఁ బాపభయమింతయు లేనపు డెన్నియేసియుఁ

గుడిరిచి చెప్పఁజాలుదువు కోవిదునింబలెఁ జాలుఁజాలు నీ
వదనముజూచిన న్నరకబాధజనించునుసుమ్ము దుర్మతీ॥

భుజం — ఓరీ! ఆత్మస్తోత్ర పారాయణ! కులకలంకా! యింతదనుక నీ వెన్నిమాటలాడిన శాంతభావముతో నిన్ను మందలించుచుంటిని. దానిని గుర్తెఱుంగఁజాలక యేమేమో ప్రేలుచుంటివి. ఇదేతుదిగాఁ జెప్పుచున్నాఁడ నాలకింపుము.

తే॥ గీ॥ ఒక్క గ్రుద్దుకు నెత్తురు గ్రక్కునట్లు
ముక్కుమీదను గ్రుద్దెద మూఢ నోరు
మూసికొనిపొమ్ము ప్రాణముల్ పోవకుండ
బ్రతికియుండినఁ జాలును పరువదేల?

సోమ — అవునుఁడుత్తగొడ్డున కఱపులచేటను సామెతవిన్నదేకదా

తే॥ గీ॥ ఱొమ్ము వ్రయ్యలు సేసి హారమ్ముగా ధ
రింతుమోరక! యేలసామంతమింకను
వంటయిల్లొచ్చు కుందేటిపగిదియైతి
వేల బీరమ్ము నీరమ్ము పాలుసేతు॥

(ఇద్దఱు రాజభటులతో వణిక్పతి ప్రవేశించుచున్నాఁడు)

వణి — (కుమారునితో) నిర్భాగ్యుఁడా! నీకీవాగ్వ్యయమేలరా? అరుగో! న్యాయమునుపరిపాలించు దాతలు వచ్చియున్నారు. అంతయును వారే విచారించుకొందురు. నీవూరకుండుము. (వస్తువులను గొన్నిటిని భుజంగరావుమీఁద రహస్యముగాఁ బడవైచి భటులతో) అయ్యా! అంతయు మీరేచూచుచుంటిరిగదా! నాకుమాతెఱ యంతఃపురమున నిద్రించుచుండఁగా గృహంబుసొచ్చి నగలను దొంగిలించి పైఁగా నాకుత్రవానితో నెట్లు పోట్లాడుచున్నాఁడో తమరేవిచారింపుఁడు.

భటు — (భుజంగరావు చేయిఁబట్టుకొని) రక్షకభటస్థానమునకు రమ్ము
(అనిలాగికొని పోవుచున్నారు.) (నిష్క్రమింతురు.)

సోమ — తండ్రి! ఈభటులకేమయిన నాశపెట్టితివా?

వణి—ఈ వ్యాజ్యమును మనపక్షము సేయించినచో నూటపదవారులు బహుమతి యిత్తునని వాగ్దత్తముచేసి సగముగూకలు ముందిచ్చితిని

సోమ - అంతటికిని నొప్పుకొనిరా?

వణి—వారికింకను నాశయున్నది కాని కార్యాంతమున మఱొకమాటకూడ చెప్పి సంతోషపెట్టెదనంటిని.

సోమ—వాగ్ఘాటికల న్యాయవాదినేర్పఱచితిరా?

వణి—ఏర్పఱచితిని, మనభోజనానంతరము పోయి న్యాయవాదితో మాటలాడి రావలయును పోదమురమ్ము. (నిష్క్రమింతురు)

(బంధనాలయమునఁ బ్రథమద్వితీయరక్షకభటావృతుఁడై భుజంగరావు ప్రవేశించుచున్నాఁడు.)

భుజం—(జనాంతికముగా.)

సీ॥ పదిమందిహితులతోఁ బాటుచుండెడినేను
నేరస్థులను గూడినెగడవలసె
నుద్యోగమును జేసి యూరిపెద్దలతోడఁ
దగునాకీ వ్రాత దెచ్చెనజుఁడు
ప్రాసాదములమీఁదఁ బండుచుండెడినేను
బంధనాలయమందుఁ గుందవలసె
నిష్టాన్నములదిని చెలఁగుచుండెడినేను
మితభోజనముచేత మెలఁగవలసె॥

తే॥ గీ॥ సకటకాలంబు విపరీతమైనయప్డు
రాజుబంటును బంటు లేరాజులౌట
కలుగుమనయత్నములచేతఁ గాదు బ్రహ్మ
వ్రాలుదప్పించుకొనుట యెవ్వారివశము॥

కేవలము విధి ప్రేరితమని వ్రాతమెట్లు నిశ్చయింపఁగలము విధి వ్రాలుకూడఁదొలి జన్మమునందొనరించిన కర్మము ననుసరించియుండును అట్లు కాకున్న యెడల.

సీ॥ ఏనేడయా కాంత యేకాంతమునన్నుఁ
దనసెజ్జఁజేర్పఁగా దలఁచుటేడ
తలఁచెఁబో యీనాఁటఁ దనచెల్మికత్తెతో
సిగ్గది వెంటనే చెప్పుటేడ
చెప్పెఁబో చెలియుంచుఁ జెప్పినంతనె యామె
తనస్నేహితకు నన్నుఁ దార్పుటేడ
తార్చెఁబో యంతమాత్రన నేను నాసఖి
గృహమందుఁ జేరి రాగిల్లుటేడ॥
తే॥ గీ॥ రాగిమొందిన నేమాయె రమణితోడ
నప్పుడప్పుడుకలియక యెప్పుడచటఁ
గాలమును బుచ్చనేల నా కర్మవశము
చేతఁగాకున్న నీలాటి సేగియున్న॥

ఒక్కసారి నామనోహారిణి యిచ్చటికివచ్చి నాతో ముచ్చటించె దనని యాపెచే ద్రవ్యసహాయమును బొందిన రాజభటునితో నాకు రాత్రికడఁ గబురంపియున్నది కదా! ఆపెతో మాటలాడిన నామనోవ్యథ యంతయుఁ దీరుటయే కాక ముందీవ్యాజ్యమునుగూర్చి జరుపవలసినవిషయములుగూడఁ దెలియఁగలవు.

ఉ॥ ముద్దులగుమ్మతో ననుఁగు ముచ్చటలాడినఁ దాపమారెడుꣳ
సుద్దులువల్కఁగా నెవ్యథ సుంతయునుండక సౌఖ్యమబ్బెడుꣳ
ముద్దుఁగొనంగఁ గష్టములు బోవును గౌఁగిటఁజేర్చినꣳ మహా
పద్దశవీడిపోయెడి నెబాసిఁకఁ జింతలనేలయిప్డుꣳ॥

(తిరిగిచూచి) గల్లుగల్లుమను నందెలచప్పుడు వినవచ్చుచున్నది తప్పక నాయారవపాణియు వచ్చుచుండవలయు. (తొంగిచూచి) నిజమే ఆపెయే వచ్చుచున్నది.

సీతా — (ప్రవేశించి విచారముతో)

తే॥ గీ॥ భర్తమందిరమందు నాప్రక్కమీఁద
నన్నుమదనకేళినిఁ దేల్చి యున్నభువిని

బంధనాలయమునఁ జూడవలసెనేడు
కటకటా! విధిదాటఁగాఁ గలరెజనులు॥

ఇచ్చటికివచ్చి ప్రాణేశునియవస్థను గన్నులారాఁ జూచినపిమ్మట నంతకుముందున్న మనోధీరతపోయి విచారమగ్నమగుచున్నది. నన్ను గూర్చికదా యీసుకుమారునకు కిట్టికష్టము సంభవించినది. మించినదానికేమిచేయఁగలను. నాయిష్టదేవతయగు నాహైమవతినిఁ బ్రార్థించెదనుగాక.

సీ॥ హేమదుర్గానాథు కామసుందరుదప్పు
బాఱఁదోలిననీకుఁ జీరలిత్తు
గిరిరాజతనయ నావరునికష్టముగట్టు
నెక్కించుమమ్మా నీకు మ్రొక్కులిడుదు
కౌమారినాప్రాణకాంతు నాపత్సము
ద్రముదాటజేసిన రవికెలిత్తు
గౌరినాదయితునికిలతఁ దీర్చుమునీకుఁ
బోడికుంకుమనుదెచ్చి పూజసేతు!
తే॥ గీ॥ అంబనాప్రాణకాంతకానికి నడరుబాపు
మఖిలఫలములుదెచ్చి నీకర్పణంబు
సేతునాకుసంతోషంబు సేయుమంబ
సకలగుణపుష్పరోలంబ శైలజాంబ॥

ప్రథ—ఓయి! కడచినరాత్రిమనకుఁ దెల్పినప్రకారము సీతమ్మగారు వచ్చియున్నారు మనముకొంచెమావలికిఁ బోవుదమురమ్ము.

ద్వితీ—అవునురా మనకు జాలడబ్బుకూడ నిచ్చియున్నది. అటులనేపోవుదము. (నిష్క్రమింతురు.)

సీతా—(భుజంగరావును సమీపించి విచారముతో.)

మలయమారుతరాగము-ఆటతాళము.

(సంభాషణము.)

అకటనీకీవికటమగుస్థితి। నమరఁజేసెనుగమలగర్భుఁడు

వికలమగునీహృదయమందున వెరపుఁగాంచకుమెడలుగష్టము॥

భుజం — చెలియనీముఖచంద్రబింబము తొలఁగఁజేసెను నాదుకష్టము
లలితమగునీమాటలనువిన। గ్లానిలేశములేకపోయెను॥ చెలి॥

సీతా — నాథనీకొకన్యాయ్యవాదిని నమరగూర్చితిధనమునిచ్చితి
నాధనంబునుగొంచునాతఁడు నాకు వాగ్దానంబొసంగెను॥ నాథ॥

భుజం — ఏమివాగ్దానమును నాతండిచ్చెనో యది తెల్పవేసఖి
నామనోహారివ్యాజ్యవిషయ మదేమియగునని కబురుపంపెను॥ ఏ॥

సీతా — కల్లతెలఁగునుఁ బన్నియుండిన కారణంబున మనముగెల్తుము
ఎల్లిజరుగువిచారణంబునఁ దెల్లమౌనని చెప్పిపంపెను॥ క॥

భుజం — సాక్షులెవ్వరటంచునడిగిన సకియయేమని తెలిపియుంటివి
కక్షిదారులపన్నుగడ వ్యక్తంబుగాదని నేనెఱుంగుదు॥ సా॥

సీతా — నేనొకర్తను జెలులొకిద్దఱు నిజము సెప్పట కొప్పుకొంటిమి
కానితండ్రికి నెడముగాఁగల కాలమిప్పటి కరుగుదెంచెను॥ నే॥

భుజం — లోకనిందకుఁ బాత్రిరాలవు కాకయుందుము నాదుకర్మము
నాకుఁదప్పదు గాననేనది న్యాయ్యవిధినను భవమునొందెద॥లో

సీతా — లోకనిందయుఁ బ్రాణహానియు లోనుగాఁగల వానినెన్నఁడు
సాకుఁగొనుచు మనోహరాంగునిఁ జాలకష్టముపాలుసేతునె॥లో

భుజం — స్నేహలక్షణమన్ననిదియె చెలియనేటికిఁ దెలిసికొంటిని
రాహుముక్తశశాంకవదన పరామృశించితివెంతయహహా॥ నే

సీతా — (తిరిగిచూచి) నాయకా! ఎవ్వరో యొక రాజస్థానాధికారియిటువచ్చు చున్నట్లున్నది. నేనిచ్చటనుండుటంత యుచితము కాదు. నేను బోయివత్తునా?

భుజం — అవును నిజమే నీవీకఁబొమ్ము పిలయినప్పుడెల్ల నీముఖదర్శన భాగ్యము నాపై వెదజల్లుచుండుము

సీతా — చిత్తమట్లేయొనరింతును (నిష్క్రమించుచున్నది)

భుజం — (జనాంతికముగా)

ఉ॥ వచ్చినవాఁడువచ్చె నిఁకఁ బంకజనేత్రను బాయకుండునా
కచ్ఛపలాక్షి యెంతయు సహాయము సేయుదునంచుఁ జెప్పెనే
నిచ్చటఁగుందనేల యిది యెట్లును గల్పితనేరమాటచేఁ
జెచ్చెరఁగొట్టివేయుదురు చేడెనుగూడెదఁ జింతవీడెదన్॥

(భ్రాంతియే కాని భావికాలము నెవరు నిర్ణయింపఁగలరు?

తే॥ గీ॥ ఎట్టికాలంబునకు నెద్ది యేవిధాన
జరుగవలెనో యది సతంబు జరుగుఁగాని
మనుజు లనుకొన్న యటు లేదియును నొకప్పు
డేనిఁ గాఁజాల దవనినెం దేనిఁగాని॥

ప్రిధ — (ప్రవేశించి) భుజంగరావుగారు మీా వ్యాజ్య విచారణదినము నేడే. తమరిని "న్యాయస్థానమునకుఁ గొనిర" మ్మని ప్రభువుగారి యుత్తరువైనది (తాళముతీయుట నభినయించి యతనిని భటుఁడు వెంటఁగొనిపోవుచున్నాఁడు.) (నిష్క్రమింతురు)

— గద్యః —

ఇతి శ్రీమత్కాశినాథుని వీరమల్లయారాధ్య
విరచిత సీతామనోహర నాట
కంబునఁదృతీయాంకము.

శుభమస్తు.

అవిఘ్నమస్తు.

సీతామనోహరము.

చతుర్థాంకము.

న్యాయస్థానము.

(రాజును, దంబాచారి ఉత్తమరావను న్యాయవాదులు ప్రవేశించుచున్నారు.)

రాజు — సేవకా! వణిక్పతిని భుజంగరావును బిలువుము.

సేవ — చిత్తము. (మూడుసారులు పిలుచును.)

వణి — (ప్రవేశించి) దణ్ణములండి

రాజు — ప్రమాణము చేయించవోయ్.

సేవ — దేవుని యెదుట ప్రమాణముచేసి అంతయు నిజముచెప్పెదను. అబద్ధమేమియును జెప్పను. (అని వణిక్పతిచే ననిపించును.)

రాజు — నీపేరేమి?

వణి — అయ్యా వణిక్పతండి.

రాజు — నీతండ్రిపేరేమి?

వణి — పేరిసెట్టి.

రాజు — నీవ్యాజ్యమేమిటి?

వణి — అయ్యా! యీ శు ॥ బుధవారమునాడు రాత్రి 12 గంటల వేళ భుజంగరావు నాగృహములో దొంగతనమునకై ప్రవేశించి మేమందరమును గాఢముగా నిద్రించుచుండఁగా పూర్ణాభరణ భూషితమైన నాకుమార్తెయగు సీతారత్నము మెడలోని బంగరు కంటెయును గాసులపేరు సంగ్రహించుకొని పారిపోవుచుండఁగా మాకుత్తుది మెలుకువగాంచి కేకలుపెట్టినది. అప్పుడు నాకుమారుఁ

డగు సోమయ్య నిద్రలోఁ ద్రుళ్లిపడిలేచి వానినిఁ బట్టుకొనెను. నేను రక్షకభటాలయమునకేగి యచ్చటి యధిపతితోఁ జెప్పితిని వారిద్దరుభటులను నావెంటబంపినపుడా భటులు నాగృహమందు నాకుమారునితో వివదించుచున్న భుజంగరావును బట్టుకొని యుత నియొద్దనున్న నగలతోఁ దమవెంటఁ గొనిపోయి కొట్టులోనుంచిరి. న్యాయప్రభువులరగు తమరు విమర్శించి దోషియగు భుజంగరావు నుశిక్షించి నాసొత్తును నాకిప్పించఁగోరెదను.

ఉత్త—భుజంగరావు మీ యింటిలోఁ బ్రవేశించునప్పుడు చూచి యుంటివా?

వణి—లేదు.

ఉ—నగలను నీకుమార్తె మెడలోనుండి తీసుకొనుచుండఁగా నామె కాని నీవుకాని మఱియెవ్వరుకాని చూచి యుండిరా.

వణి—నేను చూడలేదు నాకుమార్తె చూచి కేకలుపెట్టినది.

రాజు—నీకుసాక్షు లెవరు

వణి—సీతారత్నము, సోమయ్య, రంగిసెట్టి.

రాజు—సేవకా! సీతారత్నమును పిలువుము.

సేవ—(ముమ్మారు కేకలిడి సీతారత్నమును పిలిచి వెంట గొనివచ్చి ప్రమాణము చేయించును.)

రాజు—నీపేరేమి?

సీతా—సీతారత్నము

రాజు—నీభర్తపేరేమి?

సీతా—భుజం, రామస్వామి.

రాజు—భుజం రామస్వామియా?

సీతా—కాదు రామస్వామి.

రాజు—అటులనా? సరే! మంచిది. నీవు భుజంగరావునెఱుగుదువా?

సీతా—ఎఱుగుదును.

రాజు—అతఁడు మీయింటికిఁ దొంగతనమునకై ప్రవేశించినాఁడా?

సీతా—లేదు.

రాజు—నీమెడనుండి నగలుతీసుకొనుచుండఁగాఁ గేకలు బెట్టితివా ?

సీతా—లేదు.

డంబా—నీవివాహసమయమందు నీకేమేమి నగలుపెట్టినారు ?

సీతా—కంఠి, కాసులు, వడ్డాణము, పోచీలు, కాళ్ళజతలు, చేతిజతలు, నిచ్చినారు. మఱికొంతరొక్కమిచ్చినారు.

డంబా—అవియన్నియును నిప్పుడు నీకడనున్నవా ?

సీతా—కంఠి, కాసులు, రొక్కము నాయొద్ద లేవు.

డంబా—ఏమయినవి ?

సీతా—రొక్కము నాకియ్యలేదు కంఠి, కాసులు మాతండ్రిగారుతీసుకున్నారు.

డంబా—ఎప్పుడు.

సీతా—వారముదినములయినది.

డంబా—భుజంగరావు దొంగతనము చేసినాడని చెప్పుటకు భయమగుచున్నదా ?

సీతా—భయమేయగుచున్నది.

డంబా—(కూర్చుండును)

రాజు—ఏమయ్యా ! ఉత్తమరావుగారు నేరస్థునిపక్షమున మీరేమైన నడుగుదురా ?

ఉత్త—చిత్తము. (సాక్షితో) మీనాయనగారు నీకంఠియు, గాసుల నెందుకుఁ దీసికొనిరి ?

సీతా—నాకుఁ దెలియదు.

ఉ—భుజంగరావు దొంగతనముచేయ వచ్చినాఁడనుటకు భయమగుచున్నదంటివే అదేల ?

సీతా—అనృతమగుటవలన

ఉ—నీవు రామస్వామిని వివాహమాడుట కంగీకరించితివా?

సీతా—లేదు.

ఉ—అట్టిచో వివాహ మెట్లయినది?
సీతా— నాతండ్రిగారు బలవంతముగఁ జేసినారు.
ఉ—నీతల్లియు సోదరుఁడు నొప్పుకొనిరా?
సీతా—లేదు
ఉ—చాలునింకఁబొమ్ము
రాజు—సేవకా సోమయ్యనుపిలిచి ప్రమాణము సేయించుము
సేవ—చిత్తము (మఱియొకరుపిలిచి సోమయ్యచేఁ బ్రమాణముసేయించును.)
రాజు—నీ పేరేమి?
సోమ—సోమయ్య.
రాజు—నీతండ్రియెవరు ?
సోమ—వణిక్వ్రతి.
రాజు—నీవయస్సెంత ?
సోమ—25 ఏండ్లు.
రాజు—డంబాచారిగారు ! అడగండి?
డంబా—భుజంగరావు నెఱుఁగుదువా?
సోమ—ఎఱుగుదును
డంబా—నీతండ్రి యితనిపైఁదెచ్చిన వ్యాజ్యమునుగూర్చి నీకేమి తెలియును.
సోమ—ఇతఁడు ౫ బుధవారమునాడు రాత్రివేళ మాయింటిలోఁ జొరబడి నాచెలియలిమెడలోని కంఠియుఁ గాసులపేరును దీసుకొని పోవుచుండఁగా నేనుపట్టుకొని మాతండ్రిని పిలిచితిని ఆయనరాజ భటులను పిలుచుకొనివచ్చి వారికి భుజంగరావు నొప్పగించి యీ వ్యాజ్యము తెచ్చినాడు.
డంబా—(కూర్చుండును)
రాజు—ఉత్తమరావుగారు కానియ్యండి,
ఉ—నగలను నీచెల్లెలిమెడలోనుండి తీసికొనుచుండగా నీవుచూచితివా

సోమ—లేదు. తీసికొని పాఱిపోవుచుండగాఁ జూచితిని.
ఉ—నీకును భుజంగరాఘునకును విరోధమున్నదా?
సోమ—ఉన్నది.
ఉ—ఎందువలన?
సోమ—ఊరకయే.
ఉ—ఎవరెవరికి?
సోమ—నాకును నాతలిదండ్రులకును నతనియెడల విరోధమే.
ఉ—నీచెలియలిని రామస్వామికిచ్చుటకు నీవిష్టపడియుంటివా?
సోమ—లేదు.
ఉ—అతనినిఁ జేసికొనుటకామె యిష్టపడినదా?
సోమ—లేదు.
ఉ—చాలునిఁకబొమ్ము.
రాజు—సేవకా! రంగిసెట్టినిఁబిలిచి ప్రమాణముసేయింపుము
సేవ—చిత్తము. (అట్లుసేయును)
రాజు—నీపేరేమి?
రంగి—నాపేరు రంగిసెట్టి.
రాజు—నీతండ్రిపేరేమి?
రంగి—అబద్ధాలు.
రాజు—నీకెన్నియేండ్లు.
రంగి—నలుబది సంవత్సరములు.
రాజు—డంబాచారిగారు! ప్రశ్నింపుఁడు.
డంబా—నేరస్థుని యెఱుఁగుదువా?
రంగి—ఎఱుగుదును.
డంబా—ఎంతకాలమునుండి యెఱుగుఁదువు?
రంగి—చిన్నప్పటినుండి ఎఱుగుదును.
డంబా—ఎట్లెఱుఁగుదువు.
రంగి—అయ్యో! ఒకర్యాల్రివారమే కా.

డంబా—ఇతని గుణ మెటువంటిది.

రంగి—వాఁడు మంచివాఁడే కాని చిన్నప్పటినుండి కొంచె బోగముమో
తులును, పోకిరిసహవాసము కలవాఁడును.

డంబా—వారము దినముల క్రిందట నితఁడేమి చేసినాఁడో నీకు తెలుసునా?

రంగి—మూవణిక్పతిగారియింట్లో నగ లెత్తుకొనిపోయినాఁడని అన్నారు.
కాని నాకళ్ళతో నేను చూడలేదు. పాపపు మాటలెట్లాడ చెప్పుదును.

డంబా—ఎత్తుకొనిపోయిన దెవరని యన్నారు?

రంగి—భుజంగరావనియే అన్నారు.

డంబా—(కూర్చుండును.)

ఉత్త—(లేచి) భుజంగరావని యెవరన్నారు?

రంగి—అందరు నన్నారు.

ఉ—అందరనఁగా నెవరు?

రంగి—వణిక్పతివారందరు నన్నారు.

ఉ—వణిక్పతి యింటివిశేషములింకేమయినా నీకుఁ దెలుసునా?

రంగి—అ. అ. అ. అబ్బే. రామ రామ. మనవంటివారను కోఁదగనివి
యొందుకులెండి పాపము పుణ్యము భగవంతుఁడికి తెలియవలెను.

రాజు—నవ్వకూడదు తెలిసిన నిజమంతయుఁ జెప్పుము. లేకున్న నిన్ను
శిక్షించెదను.

రంగి—(భయముతో) చిత్తము. చిత్తము

ఉ—తెలుసునా? తెలియదా?

రంగి—అంటారుకాని నాకు తెలియదు.

ఉ—ఏమనియంటారు?

రంగి—ఆపిల్లకు వీడికి సంబంధమున్నదని.

ఉ—వాలునుఁబోయ్యి (కూర్చుండును)

డంబా—(లేఁచి) న్యాయాధిపా! ఈదొంగతనము జరిగినసమయము
నడురేయియాయియున్నది అట్టిపనికి సాక్ష్యము దొరివిగా దొరక

ట యుసంభవము మూడవసాక్షి యగు రంగిసెట్టి చెప్పినదానినిఁ బట్టియు నేరస్తుని ముఖవైఖరినిఁ బట్టియు నితఁడీ దొంగతనమును చేసియుండెననుట కెంతమాత్రమును సందేహము కనుపించదు. రక్షకభటులు వణిక్పతియింటిలో భుజంగరావును బట్టుకొనినపుడు చౌర్యధన మతనియొద్దనే యున్నట్లు వారు తమ న్యాయస్థానమునకుఁ బంపినకాగితమును బట్టి స్పష్టముగా నమ్మదగియున్నది. ఇతఁడు మున్ననేకపర్యాయము లిట్టి వ్యాజ్యములలో న్యాయస్థానమునకెక్కి యున్నాఁడు. వీని దౌర్జన్యమును బట్టి నిజముగా నెఱిఁగిన దానినిఁ గూడఁ బలకరను గారణముచేత గొందఱుసాక్షులను మేము వదలుకొని యుంటిమి. ఋజువు కాకపోయినను న్యాయాధిపతుల స్వాభిప్రాయమును బట్టి న్యాయాధిపతులు నేరస్థులను శిక్షింపవచ్చునని శాస్త్రమొప్పుచున్నది. వీని నిప్పుడు శిక్షింపక విడిచిన యెడల ననేకమంది జనులకుఁ గష్టములు సంభవించును. గావున జనసౌఖ్యార్థమై దుర్మార్గుఁడగు వీనిని శిక్షింపవలయునని నేరాపాదకుఁడు తమయొక్క ఘనమును గూర్చి మిక్కిలి ప్రార్థించుచున్నాఁడు.

ఉత్త—(లేఁచి) న్యాయాధిపా! ఇది కేవలము కల్పిత వ్యాజ్యమైయున్నది. మొదటిసాక్షియొక్క వాఙ్మూలమును బట్టి యీవిషయమును దేవరవారు విస్పష్టముగాఁ దెలిసికొని యుందురు. రెండవసాక్షి చెప్పినప్రకారము నేరాపాదకుని కుటుంబములోని వారందరికిని నేరస్థునియందు విరోధమున్నట్లు తెల్లమయినది. ఆ విరోధకారణ మతఁడు సిగ్గుచే జెప్పకపోయినను మూడవసాక్షి వాఙ్మూలముయొక్క చివరభాగమును బట్టి విశదమగుచున్నది. అట్టి విరోధముచేత నీవ్యాజ్యమును గల్పించి యుండవలయునే కాని యిది యథార్థముగా జరిగియుండలేదు. రక్షకభటులచేఁ బంపఁబడినవిచారణాంశములను నమ్మఁగూడదని తగు హేతువులను బట్టి దొరతనము వారు శాసించి యున్నారు. ఈ నేరము జరుగుచుండఁగా స్వయముగా

జూచినట్లొక సాక్షియుఁ జెప్పియుండలేదు. ఈనిష్ఫలమగు కల్లోలమునకు వణిక్పతియే కారకుఁడు. ఏమన- ఈడువచ్చియున్న తనకొమార్తెకనుకూల దాంపత్యము సంభవింపజేయుటయే. కాఁబట్టి న్యాయవిమర్శకులగు ప్రభువులు, నిర్దోషియగు భుజంగరావుపై వణిక్పతి విరోధ భావముతోఁ దెచ్చిన యీకల్పిత నేరమును దగ్గించి పరువునకు నష్టమును గలుగజేసినందునకు వణిక్పతిని శిక్షించి యతనివలన భుజంగరావునకుఁ గొంతధనము నిప్పించవలయునని తమయొక్క ఘనతనుగూర్చి మిక్కిలి ప్రార్థించుచున్నాను.

రాజు — భుజంగరావు! నీపయిన రాఁబడిన యీవ్యాజ్యమునకు నీవే యేసమాధానమును జెప్పుకొనియెదవు?

భుజం — అయ్యా! యీచెప్పెడి నేరమును నేనెన్నఁడును చేసియుండలేదు. నాకేమియును దెలియదు. ఇది కేవలము కల్పితము. కంతియుఁ గానులును నాపైఁ బడవైచి రక్షకభటులను మంచిమాటఁ జేసికొని నన్నిట్లు వణిక్పతి యగౌరవము చేసినాఁడు. ఆసొత్తును వణిక్పతియే తీసుకొనినట్లు మొదటి సాక్ష్యమువలన రుజువు కాఁబడినది. నేను నిర్దోషిని. నన్ను రక్షింపవలయును. యింతకంటె నేను జెప్పుకొనునదేమియును లేదు.

రాజు — ఈవ్యాజ్యములోని సాక్షులవలన నేరమెంతమాత్రమును రుజువు చేయఁబడి యుండలేదు. మొదటిసాక్షి భర్తపేరు చెప్పుటలో జరిగిన పొరబాటునుబట్టియు, రెండవసాక్షి నేరస్థునియందు దమకుటుంబములోఁ నందఱికిని నిష్కారణవైర మున్నదనుటను బట్టియు మూఁడవసాక్షి స్పష్టముగా నొప్పుకొనుటను బట్టియు వణిక్పతి కుమార్తెకును భుజంగరావునకు సంబంధ మున్నదని స్పష్టముగా నమ్మదగియున్నది. ఆసొత్తును బయటఁబెట్టుకొనినచో మర్యాద భంగమగుననియు తటస్థముగా నూరకొనుటకు మనసొప్పకయు

నీ నేరమును గల్పించినట్లు నాకు స్పష్టము గాకన్పడుచున్నది. దొంగతనపు నేరమందు భుజంగరావు నిర్దోషియని నమ్మితిమి. ఇకముం దెన్నడును నిట్టికల్పిత నేరమును దేకుండుటకై వణిక్పతిని మందలించుచు వ్యాజ్యమును దగ్గించడమైనది.

(సభ్యులందఱు నిష్క్రమింతురు.)

గద్య.

ఇతి శ్రీమత్కాశీనాధుని వీరమల్లయారాధ్య
విరచిత సీతామనోహరనాట
కంబునఁ జతుర్థాంకము.

సం॥ [illegible]

శుభమస్తు.

శ్రీ అవిఘ్నమస్తు

సీతామనోహరము.

పంచమాంకము.

(వణిక్పతియుఁ, గుమారుఁడును ప్రవేశించుచున్నారు)

సోమ—జనకా! రక్షకభటులకు సగము ద్రవ్యము నిచ్చియుంటిమి. వారిందున మనకేమి సాయమును సేయలేదు. కావునఁ దక్కిన ధన మియ్యకుము.

వణి—అదికూడ నామనసటే దినమునే తీసికొనినారు

సోమ—మనమనుకొన్న కార్యము ఫలించకపోఁగా నిష్కారణము భటులు డబ్బుకాఁజేసినారే! దీనివలన మనకవమానము తప్ప మఱేమియుఁ గలుగలేదు. మొదలకె యూరకొనిన చక్కఁగానుండెడిది.

వణి—వారికిచ్చినది దండుగయే కాదు. ఏమన, వారికధికారమున్నంత వరకొక్క దినము కొట్టులో వేసినారుకదా? ఇఁక పరాభవమా? అది స్వయముగాఁ దెచ్చుకొనినదే. ఆ చండాలపుముండ నెన్నఁడు సాక్ష్యమునకు దెచ్చితిమో నాఁడే యవమానము వచ్చినది. ఛీ! దాని మొగమును జూడరాదు. నేనింటికిరాను ఎచ్చటికేనిఁబోయెదను.

(నడుచుచున్నాఁడు)

సోమ—(పట్టుకొని) ఎక్కడికేగెదరు. ఇంటికి రండు మాయమ్మగారితో జెప్పిపోవచ్చును. (అనిలాగికొనిపోవును) (నిష్క్రమింతురు)

(వణిక్పతిగృహము.)

(వణిక్పతియు, గమలాంబయు, గుమారుఁడును ప్రవేశించుచున్నారు.)

కమ—నాథా! కావలయునని తెచ్చుకొనిన దానికిప్పుడు విచారపడిన నేమిలాభము. భూలోకమునఁ బుట్టినతరువాత సహజముగాఁ గలు

గుచుండెను కష్టసుఖములు. ప్రతిష్ఠాప్రతిష్ఠలును మనుష్యజాతికిఁ గాకింకెవరికి సంభవించగలవు. శుద్ధమూర్ఖణము వహించి యాడపిల్లను న్యాయసభకు సాక్ష్యమునిమిత్త మీడ్చుకొని పోయి యుంటిరి. ఆకుర్రనిర్భాగ్యురాలు, వ్యవహారములు తెలిసిన మగవారివలె నసత్యములుపలికి నిర్వహించుకొనఁగలదా? న్యాయాధిపతులను జూచినతోడనే దానికి యొడలు కంపమెత్తినదట. ఆ భయోత్పాతముచేత నిజము వెలుపలఁ బెట్టినది. మీరా విషయమున కభిమానపడి కుమారిక బుద్ధిపూర్వకముగా మీకెగ్గుగావించినదని తలంచి "యింటనుండి లేచిపోయెద" ననుట మంచిది కాదు. ఎచ్చటికిఁ బోయెదరు? ఊరకుండుడు.

వణి—ఎచ్చటికిఁ బోయెదనా? పెద్దయేటిలోనికి, చెప్పెదనువినుము.

సీ॥ కాశికాపురిఁ జేరి గంగానదీస్నాన
మును జేసి విశ్వేశ్వరుని భజించి
రామేశ్వరముఁబోయి రామసేతుస్నాన
మును జేసి రామలింగని భజించి
శ్రీపర్వతమునకుఁ జేరి పాతాళగం
గనుమున్గి మల్లికార్జును భజించి
వరకాళహస్తి సువర్ణముఖిని మున్గి
కాళహస్తీశునిఁ గనిభజించి
తే॥ గీ॥ ఎచ్చటేసియు వసియింతు నేమిఫలము
పరువువిడనాడినట్టి యీబ్రతుకువలన
నిహము లేకున్న స్వర్గలోకైక సుఖము
గలుగుఁగావునఁ బోనిమ్ము కాంతనన్ను॥

కమ—సర్వమెఱిఁగినయట్టి మీకు మేము చెప్పెడిపాటివారము కాక పోయినను నామనవినిఁగూడ నించుకంతే యాలకింపుడు. సంసారభారకర్తలగు మీరే యట్లు తలంచినచో మీతోడిదియే లోకమని యెంచుకొనవలసిన నేనుమాత్ర మిచ్చటనేలయుండవలయును.

నేనును వచ్చెదను. నన్నుఁ గూడఁ గొనిపొండు. మీకొమరులీ సంసారభారమును వహింతురు

సోమ.—ముక్కుపచ్చలారని కుఱ్ఱపిశాచముపైనఁ గోపము వహించి యిట్టి యనార్యకార్యమును సేయఁదలంచుట మీ కుచితముగాదు. ఆ పిల్ల యనూరనిన మనకుఁ జయము కాదు. ఇతరులెంత కఠినమునను కొన్నను తల్లిదండ్రులు మాత్రము గుటుక్కున దిగమ్రింగి తనపుత్రికామణిని గడుపులోఁ బెట్టుకొనవలయును. లోకమునకెల్లమూఖుఁడయిన స్వకుక్షి పరాయణుఁడుదక్క తక్కొరులు మీవలె నిట్లు సేయరు.

ఉ॥ అల్లునిమీఁదఁ గోపమున నంగలు సాచుచు నచ్చటచ్చటన్
జెల్లని కోపతాపమున సిగ్గును బోవిడి లేచిపోని వా
కిల్లులు బల్కు మూర్ఖవలెఁ గాక మనంబున శాంతిఁ గాంచి మీ
పిల్లను గడ్పలోననిడి ప్రేమను జూపుట యుక్తమౌఁ జూఁడీ॥

ఒకవేళ లోపమెయున్నచో.

తే॥ గీ॥ కుఱ్ఱదానినిఁ బిలిపించి కోపగించి
బుద్ధిసెప్పక మీరిట్లు పోదుమంచు
వెడల నేటికి నేఁ బోయి పిలిచి తెత్తుఁ
దప్పసైచుము కొమిరెపై దయ వహించి॥

వణి—(తనలో) "కడుపుఁ జించుకొనినఁ గాళ్లపయిఁ బడు" నన్నట్లు నా కడుపునఁ బుట్టిన పిల్లను రట్టుకెట్టుట నాకు నిజముగనే ధర్మము కాదు. కావునఁ బిలిపించి మందలించెదనుగాక. (ప్రకాశముగా.)

తే॥ గీ॥ కులపుమర్యాదమంజెడఁ గొట్టినట్టి
మూర్ఖురాలినిఁ గొనిరమ్ము పొమ్ము తగుచి
వాల్లఁ బెట్టెద నిఁకబుద్ధి వచ్చునేమొ
యిదియు మోచకున్న నిలు వెడలెదను నేను॥

సోమ—చిత్తము అటులనే సేతును. (నిష్క్రమించుచున్నాఁడు.)

కమ—(భర్తతో) మీరనినట్లు దానియందు లోపమున్న మాటవా

స్తవమే యనుకొనుఁడు దానిఁ బయల్పఱచినలోపము మనకుఁ గా-
దా? పిల్లదానిని భయపెట్టక నెమ్మదిగా మందలింపుఁడు.

వణి—పిచ్చిదానా! నాకుమాత్రము మనస్సులో లేదనుకొంటివా యే-
మే? నెమ్మదిగానే మందలింతును లెమ్ము. ఊరక కళ్ళుఁ బెళ్ళు బెదరిం-
తునే కాని తిట్టుదు ననుకొంటివా కొట్టుదు ననుకొంటివా?

సీతా—(ప్రవేశించి) తండ్రీ నమస్కారము నాకేమి సెలవు?

వణి—(తనలో) కొంచెము కోపభావమును సూపవలయును. (ప్రకా-
శముగా.)

ఉ॥ ఓసి యభాగ్యురాల! చలమూని కులంబునఁ జేటుఁ దెచ్చితే
దోసపుఁ గృత్యముల్ సలిపి దుందుడుకింతయొనర్చితౌర, మ
ద్వ్యసనము నాదు తప్పనొక పీసమునీ దగు తప్పితంబులన్
జేసియిటుల్ పరాభవము సేగిలభించెఁ గతంబిఁ కేటికిన్ ॥

తే॥ గీ॥ ఇంక నేనియుండ గురీతి నింటికడను
మంచివర్తనమునఁ జరియించితేని
మేలు కాక యథాస్థితి మెలఁగితేని
నిన్ను వెడలింతు నెందేని నేనుఁ బోదు॥

సీతా—మీరంతగాఁ గినియుటకే నొనరించిన యకృత్యమేమియును లే-
దు. నేనింటనుండుటయే కష్టముగాఁ దోఁచినచో నెచటికేనిఁ బోయి
పిలయిన బ్రతికెదను. లేనిచో మడిసెదను. ఇంత భారము వహింపఁ
నేటికి?

వణి—పరువుగలయింటఁ బుట్టి వ్యభిచరించుట సుకృతమా? న్యాయస-
భయందు దండిని బరాభవించుట యుచితమా? రెంటిలో నేది
నీకుచితమని తోఁచినది.

సీతా—పతితోఁ గలియుట వ్యభిచారమును గాదు. నిజమును బల్కుట
నిను పరాభవించుటయును గాదు.

వణి—అగ్నిసాక్షిగ వివాహముఁ జేసికొన్న భర్తయుండఁగా నెవ్వఁడో
త్రాష్టుడు నీకు భర్తయగునా? ఆహా! ఎంత యవివేకముగా నున్నది.

సీతా—అవును ఇందు విపరీతమేమున్నది. మనస్సాక్షిగ నేనువరించిన పురుషుఁడునాకు భర్తయగును గాని నాకిష్టములేనిదే దారముగ ట్టిన మఱియొకండెట్లు కాఁగలఁడు.

పణి—అయిన నీవేమనియెదవు;

సీతా—ఇందేమియు దోసములేదని యెదను.

పణి—ప్రప్రథమస్వీకృతుడుండగా మఱియొకనిఁగూడుట తప్పేలకాదు?

సీతా—చెప్పెదనువినుము,

సీ॥ తొల్లివిఘ్నేశు చేదోయిజిక్కనలచ్చి
వైకుంఠవాసుఁజేఁ బట్టెనెట్లు
అజపోతమును బెండ్లియైన గాంధారియా
ధృతరాష్ట్రుపాణిగ్రహించెనెట్లు
అర్కప్రసాదంబు నందినయాకుంతి
పాండురాజునుగూడి బరగెనెట్లు
మొదట స్వయంవరంబునఁ బార్థునకుఁదక్క
ద్రౌపది యేవురిఁ దగిలెనెట్లు॥
తే॥ గీ॥ వారలందఱునుం బతివ్రతలటంచు
మూఁడులోకంబులనుగీర్తిఁ బొందలేదె
తెలిసితెలియని యూహఁబుం శ్చలియటంచు
బలుకఁజెల్లునె నీయట్టివారలకట॥

చ॥ పడఁతికి మానసంబెవరి పైఁబ్రసరించునొ తొల్తనట్టి యా
తఁడు ధవుఁడౌనుగాక తలిదండ్రుల ప్రేరణచేతఁగన్యకుఁ
మెడకొకతాడుగట్టి బలిమిన్ గులకాంతయటన్నఁజెల్లునే
వెడఁగుఁదనంబుగాక నయవేదులకీగతి బుద్ధిపుట్టునే॥
తే॥గీ॥ నేవరించునట్టి భుజంగరావునాకు
భర్తయగుగానిఁ యాదేబెభర్తకాఁడు
హితమయేనియునన్నుంచు డింటలేద
యేనిపో యెదనింకెటకేని యేను॥ (సిద్ధ)

వణి—(తనలో) చాలునీకిఁబుద్ధివచ్చినది. నాకుమాత్రమే కాక లో
ములోని తల్లిదండ్రులందఱికిని మంచినడత నేర్పినది ఉదాహరణ
పూర్వకముగా జెప్పుచున్నప్పు డెవ్వరు కాదనఁగలరు ఇంతకునీయా
డువాండ్రకు విద్యాబలము హెచ్చినకొలఁదిని నిట్టిమందమతుల
పుట్టుచున్నవి (భార్యతోఁ బ్రకాశముగా)

చ॥ తెలివియొకింత లేక సుదతీమణి కిష్టము లేనివానిఁ బెం
డిలి యొనరించినందుకుఁ గడిందివిచారము సంభవించె నెం
దులకిఁక లేసిపోనిఫని? తోయజనేత్ర! కుటుంబభారముల్
దొలఁగి వనాంతరంబున ననూన తపంబొనరించుటొప్పగున్॥

కమ—అవును, మనకీ సంసారసంబంధము విడచుటయే యుచితము
నాకునుదోఁచెడిని

చ॥ వనమున కేగనేల యొకపంచను గూర్చుని రామ రామ యం
చనుకొని కాలముల్ గడపి యాకసిగందుల చేతిమీఁదుగాఁ
దనువుల దాటవేసి సుఖదంబగు నిర్జరలోక సౌఖ్యముల్
గనుటుచితంబు, నాథ! ననుఁగాదన కిష్టమొసంగఁ గాఁదగున్॥

వణి—అటులనే కానిమ్ము

మత్తకోకిల॥ భూతలంబునఁ దల్లిదండ్రులు పుత్రికాహితుఁ డౌ వరున్
జేతనావిధిఁ గూర్చుటొప్పను శ్రేయముల్ గనుబుద్ధితో
నీతలోదరి యట్టులేరను నెప్పుడుల్ గనకుండఁగన్
జాతకంబిడు గాతమీశుఁడు సత్కృపాహితవృత్తితోన్॥

(అందఱు నిష్క్రమింతురు)

గద్య.

ఇతి శ్రీమత్కాశీనాథుని వీరమల్లయారాధ్య
విరచిత సీతామనోహరప్రహస
నంబునఁ బంచమాంకము